MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 3 రంగారెడ్డి నవంబర్ 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## జాతీయ ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యలకు ఏపిమాస్ పురస్కార ప్రదానోత్సవం !




పురస్కార గ్రహీతలతో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి , ఏ పి ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శ్రీ బి. రాజశేఖర్, ఏపిమాస్ వైస్ ఛైర్ పర్సన్ శ్రీమతి మహపర్ అలి, ఎస్ బి ఐ - సి జి ఎం శ్రీ శంతను చంద్రకాంత్ , నాబార్డ్ తెలంగాణా సి జి ఎం శ్రీమతి సుశీల చింతల

### పురస్కార ప్రదానోత్సవంలో ప్రసంగించిన కొందరు ప్రముఖులు !


సి ఎస్ రెడ్డి


డబ్ల్యు ఆర్ రెడ్డి


జయశ్రీ వ్యాస్


సుశీల చింతల


బుడితి రాజశేఖర్


శంతను చంద్రకాంత్

ఏపిమాస్ ఆధ్వర్యంలో మరో రెండు ఎస్ బి ఐ, ఎఫ్ పి ఓ అనుసంధానాలు


మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లో ...



కర్ణాటక రాజధాని బెంగళూరులో ...

NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

# ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యలకు పురస్కార ప్రదానోత్సవంలో చర్చాగోష్ఠులు !





























సమాఖ్యల ప్రతినిధుల ఉత్సాహం ... సంబరం !

# మహిళా సాధికారత

సంపుటి 22 సంచిక 3



సంపాదకీయం

## కర్తవ్యం !

**వ**రుసగా మూడవ ఏడాది స్వయంసహాయ సమాఖ్యల (ఎస్ హెచ్ జి ఫెడరేషన్ల) జాతీయ సమ్మేళనాన్ని , ఉత్తమ సమాఖ్యలకు పురస్కార ప్రదానోత్సవాన్ని దాతృత్వ, ప్రోత్సాహక సంస్థల తోడ్పాటుతో అక్టోబర్ 10, 11 తేదీలలో ఏపిమాస్ నిర్వహించింది. ఆ రెండు రోజులు హైదరాబాదులో 'మిని ఇండియా' కొలువుతీరిందా అన్నట్టు భౌగోళికంగా దేశంలో సగానికి పైగా ప్రాంతాల స్వయంసహాయ సమాఖ్యల ప్రతినిధులు, సంబంధిత, అనుబంధిత యితర ప్రతినిధులు, ప్రముఖులు ఈ సమ్మేళనంలో పాల్గొనడం, నిర్దేశిత కార్యక్రమాలను విజయవంతం కావించడం సమాఖ్య స్ఫూర్తికి ఎంతో బలంచేకూర్చింది. మన దేశంలో, ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో రెండు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన స్వయంసహాయ సమాఖ్యలది వైభవోపేతమైన గతం! అబ్బురపరిచే వేగవంతమైన అభివృద్ధి! నాడు దాదాపు అన్ని ప్రగతి కార్యక్రమాలలో మహిళా స్వయంసహాయ సంఘాల, సమాఖ్యల ప్రాతినిధ్యమే. పేదరిక నిర్మూలన పైన, మహిళా సాధికార సాధనపైన ఒక ఆశావహమైన భవిష్యత్ చిత్రం కనువిందుచేసిన అరుదైన సందర్భమది. నిజానికి ఆ ఆదర్శ భావన, ఆ స్ఫూర్తి అలాగే కొనసాగి వుంటే అశించిన ఫలితాలను సాధించడంలో సమాఖ్యలు చాలావరకు సఫలమై వుండేవనడంలో సందేహంలేదు. కాని ఎందుకో ఆ ఉరవడి కొరవడింది, ఆ స్వశక్తి ఉద్యమ దీప్తి కొడిగట్టింది, స్వయంసహాయ ఉద్యమం గాడితప్పి స్ఫూర్తిదాయకంగా ముందడుగు వేయలేక, నిస్తేజంగా వున్నచోటనే గిరికీలు కొట్టసాగింది. తన తొలి అడుగు నుంచి స్వయంసహాయ ఉద్యమంతో విడదీయలేని అనుబంధాన్ని పెంచుకున్న,అండదండలు అందించిన, మార్గదర్శనంచేసిన, సుస్థిరాభివృద్ధితో కూడిన మహోజ్వల భవిష్యత్తును ఆకాంక్షించిన ఏపిమాస్‌కు ఈ పరిణామం, ఈ నిద్రాణస్థితి తీవ్ర మనస్తాపం కలిగించింది. అందుకే స్వయంసహాయ సమాఖ్యలలో మళ్ళీ ఆ ఉద్యమ స్ఫూర్తిని రగిలించడానికి, చైతన్యం నింపడానికి, దిశానిర్దేశం చేయడానికి ఏపిమాస్ నడుంకట్టింది. ఉన్నంతలో ఉత్తమమైన పనితీరుకు కొన్ని ప్రాథమిక ప్రామాణికాలను నిర్దేశించుకుని, ఆ ప్రమాణాలను పాటిస్తున్న సమాఖ్యలను వెన్నుతట్టి, పురస్కారాలతో ప్రోత్సహించి, ఇతర సమాఖ్యలకు ప్రేరణ కలిగించి, ఉద్యమాన్ని తిరిగి చైతన్యవంతంచేసి, మళ్ళీ గాడినపడేలా చూడాలన్న సదాశయంతో మూడేళ్ళ క్రితం స్వయం సహాయ సమాఖ్యల జాతీయ సమ్మేళనానికి, పురస్కార ప్రదానోత్సవానికి ఏపిమాస్ శ్రీకారం చుట్టింది. ఈ సమ్మేళనాలలో కేవలం విజయగాథల పేరిట స్వోత్కర్ష మాత్రమే కాకుండా అనుభవ పాఠాలు, వైఫల్యాల ప్రస్తావనలు, పరిష్కార సూచనలు వుండేలా కార్యక్రమాలను రూపొందించి పేరుకుపోయిన జడత్వాన్ని తొలగించడానికి, అర్థరహితంగా మారిన స్వశక్తి సూత్రానికి పునర్వైభవం కలిగించడానికి ఈ సమ్మేళనాలను ఒక బలీయమైన వేదికలుగా ఏపిమాస్ మలచింది. మొన్నటి సమ్మేళనంలోకూడా కేవలం ఆనందోత్సాహాలు, ఆటపాటలే కాకుండా, ఆలోచనాత్మక చర్చోపచర్చలు, క్షేత్రస్థాయి వాస్తవిక స్థితిగతులను ప్రతిబింబించే ప్రసంగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆత్మీయ మిత్రులు, స్వయంసహాయ రంగంతో రెండు దశాబ్దాలకుపైగా గాఢానుబంధాన్ని పెనవేసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్ తన ప్రసంగంలో ప్రస్తావించినట్టు సమాఖ్యలు రుణాల వలయం దాటి రాలేక, వున్న జీవనోపాధులను బలపరచుకోవడానికిగాని, కొత్త బతుకుదెరువులను ఏర్పరచుకోవడానికి కాని, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను, సామాజిక రుగ్మతలను అడ్డుకోవడానికి కాని, నిజమైన సాధికారత సాధనకు, ఆర్థిక సుస్థిరాభివృద్ధికి కాని కృషిచేయాలన్న ఆలోచనలేకుండా కేవలం అప్పు తీసుకోవడానికి, తిరిగి చెల్లించడానికే పరిమితమవుతుండడం కాదనలేని ఒక చేదు నిజం! 'ఏం సాధించామని ఈ సంబరాలు' అంటూ ఆయన వేసిన ప్రశ్న కేవలం స్వయంసహాయ సమాఖ్యలకే కాదు, వాటి ప్రోత్సాహక సంస్థలకు, అభివృద్ధిరంగానికి చెందిన వారికి, బ్యాంకులకు, ప్రభుత్వాలకు, సమాఖ్యల శ్రేయస్సును కాంక్షించాలనుకునే వారందరికీ వేసినది. ఇలాంటి ప్రశ్నలను వేయడానికి, చర్చలు సాగించడానికి, ఆదర్శపథ నిర్దేశానికి ఏపిమాస్ తప్ప మరో వేదిక ఎక్కడుంది?... అంటూ ఆయన చేసిన ప్రస్తావన ఈ జాతీయ సమ్మేళనాల నిర్వహణ ఆశయానికి ఎంతో బలం చేకూరుస్తున్నది. అందరం చేయిచేయి కలుపుదాం ... సమాఖ్యల నిజమైన విజయోత్సవాలను సమీప భవిష్యత్తులో జరుపుకోవడానికి సంఘటిత కృషి సాగిద్దాం!

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy

పరిస్థితులు నీకు అనుకూలించడం కాదు, నీవే వాటిని అనుకూలంగా మార్చుకోవాలి

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఎల్. భవాని, జి. దివ్యశ్రీ, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి


## లోపలి పేజీలలో ....


- స్వశక్తి ప్రాధాన్యతను చాటిచెప్పిన సమ్మేళనం ...05
- ఏ విజయాలు సాధించామని ఈ సంబరాలు ? ...08
- యువశక్తితో ఎఫ్ పి ఓలకు నవశక్తి ! ...10
- 6 పంటల మద్దతు ధరల పెంపు ...12
- ప్రకృతి సేద్యంతో తగ్గనున్న నిరుద్యోగం ! ...13
- ఔత్సాహిక రైతులకు పశుపోషణ ప్రాజెక్టులు! ...16
- స్త్రీలలో పోషకాహార లోపాలు... నివారణ ! ...18
- కిలో నెయ్యి రూ.2 లక్షలు ! ...20
- ప్రతి మహిళా తలెత్తుకు బతికే భవ్యభవిత కోసం ...21
- భోపాల్‌లో ఎస్ బి ఐ - ఎఫ్ పి ఓల సదస్సు ! ...22
- తెగులుతో నిలువునా ఎండుతున్న వేపచెట్లు! ...23
- 80 వ్యాధులకు అరటిపండు చికిత్స ! ...24
- భూతాపాన్ని జయించిన భూమిపుత్రులు ! ...25
- ఈ ఐదు లక్షణాలు గుండె సమస్యలకు సూచికలు ...28
- సుకన్య సమృద్ధి యోజన : ...29
- సానుభూతి కాదు... సంరక్షణ కావాలి ...30
- చీర కట్టడంలో ఇన్నిరకాలా ! ...32
- అవార్డులు గెలుచుకున్న సమాఖ్యల వివరాలు ...34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్లకు | : | రూ. 200 |
| మూడేళ్లకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


**అమోఘమైన విజయానికైనా , అనంతమైన సంపదకైనా మూలం ఒక చిన్న ఆలోచనే !**

# స్వశక్తి ప్రాధాన్యతను చాటిచెప్పిన మహా సమ్మేళనం !

దాదాపు దేశం నలుమూలలనుంచి 'స్వయం సహాయ సమాఖ్యల' (ఎస్ హెచ్ జి ఫెడరేషన్స్) ప్రతినిధులు, అభివృద్ధి రంగ నిపుణులు, ప్రముఖ ఎన్ జి ఓల ప్రతినిధులు, బ్యాంకర్లు, ప్రభుత్వాల ఉన్నతాధికారులు ఒకే చోట, ఒకే వేదికపై కొలువుదీరిన కమనీయ దృశ్యం 2023 అక్టోబర్ 10-11 తేదీలలో హైదరాబాద్ మహానగరంలో ఆవిష్కృతమైంది. ఏపిమాస్ అధ్వర్యంలో 'డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ' ప్రధాన ఆడిటోరియంలో 19 రాష్ట్రాలనుంచి 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్న ఈ స్వయంసహాయ మహా సమ్మేళనం జరిగింది.

మనదేశంలో, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో స్వయంసహాయ వ్యవస్థ పురుడుపోసుకున్నప్పటినుంచి, ఆ వ్యవస్థ క్రమానుగత సుస్థిరాభివృద్ధికి విశిష్టసేవలందించి, దానితో ఎనలేని అనుబంధాన్ని పెంచుకున్న ఏపిమాస్, ఇటీవలి కాలంలో స్వయంసహాయ రంగంలో నెలకొన్న జడత్వాన్ని, నూతన కార్యాచరణ రాహిత్యాన్ని అరికట్టి, ఆ వ్యవస్థలో మరింత ఉత్సాహాన్ని, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని, కార్యదీక్షను, నూతనోత్తేజాన్ని నింపడంకోసం గత రెండు సంవత్సరాలుగా స్వయంసహాయ సమాఖ్యల జాతీయ మహా సమ్మేళనాన్ని నిర్వహించి, పురస్కారాలతో ప్రోత్సహిస్తూ వస్తున్నది. ఆ కోవలో ఈ సమ్మేళనం మూడవది.

### ఎందుకోసం ఈ సమ్మేళనం ?

- ♦ దేశ వ్యాప్తంగా వున్న స్వయంసహాయ సమాఖ్యలు సాధించిన విజయాలను అభినందించడం
- ♦ స్వయం నిర్ణయాధికారంతో , స్వతంత్ర నిర్వహణలో ఉమ్మడిగా వ్యాపారాలు, పరిశ్రమలు చేపట్టి సుస్థిరాభివృద్ధిని సాధించిన స్వయంసహాయ సమాఖ్యలు అనుసరించిన వినూత్న విధానాలు, ఉత్తమ పద్ధతులు, నేర్చుకున్న పాఠాలను అందరితో పంచుకోవడం
- ♦ స్వయంసహాయ సమాఖ్య వ్యవస్థ స్వరూపాన్ని కొత్తకోణంలో ఆవిష్కరించి, ఈ సమాఖ్యలను సభ్యుల స్వయం నిర్వహణలో, బహుళ సేవలు అందించే స్వయం నిర్ణయాధికార సంస్థలుగా అభివృద్ధిచేయడానికి తగిన విధానపరమైన సూచనలు, సిఫారసులు చేయడం

రెండు రోజుల ఈ సమ్మేళనం వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన స్వయంసహాయ ప్రతినిధులు వారి మాతృభాషలలో ఆలపించిన స్ఫూర్తి గీతాలతో, కళా ప్రదర్శనలతో, తమ విజయగాధల ఉద్వేగభరిత ఆవిష్కరణలతో, అభివృద్ధిరంగంలో, అనుబంధ రంగాలలో సుప్రసిద్ధులైన ప్రముఖుల ప్రసంగాలతో, మార్గ నిర్దేశనంతో ఆహ్లాదకరంగా, ఆలోచనాత్మకంగా సాగింది.



**దశాబ్ది దార్శనిక చిత్రం ... స్వయంశక్తి బలోపేతం**

సంప్రదాయబద్ధంగా ఎస్ హెచ్ జి మహిళలు, ప్రముఖులచే జ్యోతి ప్రజ్వలన అనంతరం ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి తమ స్వాగతోపన్యాసంలో స్వయంసహాయ సమాఖ్యల మహా సమ్మేళనం,



సమాఖ్యలకు పురస్కారాల నేపథ్యాన్ని క్లుప్తంగా వివరిస్తూ, ఎస్ హెచ్ జి ల, వాటి సమాఖ్యల సుస్థిరాభివృద్ధికి, నిర్దేశించుకున్న ఆశయాల సాధనకు అనువుగా ఎంతో దార్శనికతతో కూడిన రూపకల్పనతో 2021 సంవత్సరంలో ఏపిమాస్ ఉత్తమ ఎస్ హెచ్ జి సమాఖ్యల అవార్డులను ప్రవేశపెట్టిందని చెప్పారు. స్వయంసహాయ సంస్థలు జీవనోపాధుల రంగంలో 3.5 లక్షల కోట్ల రూపాయల విలువైన లావాదేవీలను జరపడం, పర్యవసానంగా విద్య, ఆరోగ్యం, పోషకాహార రంగాలలో గణనీయమైన పురోగతికి ఆస్కారం ఏర్పడడం గమనార్హమైన విషయమని ఆయన అన్నారు.కోవిడ్ కల్లోలంలో ఎస్ హెచ్ జిలు నిర్వహించిన కీలకపాత్ర సమాజంలో వాటి ప్రభావాన్ని ఎలా చాటిచెప్పాయో ఆయన వివరించారు.

2021 –2030 దశాబ్ది దార్శనిక చిత్రం ఎస్ హెచ్ జి సమాఖ్యల సంపన్న స్థితిని, లైంగిక సామంజస్య సమాజ ఆవిర్భావాన్ని ఆశిస్తున్నదని శ్రీ సి ఎస్ రెడ్డి వివరించారు. ఎస్ హెచ్ జిల యాజమాన్యం, వినియోగం, నిర్వహణ అనేదే ఈ దార్శనిక ప్రణాళికలో కీలకాంశమని ఆయన చెప్పారు. ఎన్ ఆర్ ఎల్ ఎం, యు ఆర్ ఎల్ ఎంలతో అనుబంధం కలిగివున్న కారణంగా అసలు ఎస్ హెచ్ జిలు స్వయం నిర్వహణ, స్వయం నియంత్రణతో తమకు సంబంధించిన అన్ని అంశాలపై స్వయం నిర్ణయాధికారం కలిగివున్నాయా అనే విమర్శ వున్న విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.

ఈ రెండు రోజుల సమ్మేళనంలో ఎస్ హెచ్ జిల పురోగతిని, సుస్థిరాభివృద్ధిని, స్వయం నిర్ణయాత్మక, నిర్వహణాత్మక, నియంత్రణాత్మక శక్తిని ప్రేరేపించడం లక్ష్యంగా ప్రారంభ సమావేశం, మూడు సర్వప్రతినిధి సదస్సులు (ప్లీనరీలు), రెండు సమాంతర సమావేశాలు, సమీక్షా సమావేశం జరిగాయి.

శ్రీ సి ఎస్ రెడ్డి ప్రారంభోపన్యాసం ఆనంతరం ప్రదాన్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీమతి మధుఖేతాన్ స్వయంసహాయ ఉద్యమం సాధించిన ప్రగతి పట్ల సంతోషాన్ని వ్యక్తంచేశారు. లైంగిక సామాజిక సామంజస్య సాధన గురించి ఆమె ప్రస్తావిస్తూ, ఎస్ హెచ్ జి లు మహిళల నాయకత్వంలో నడుస్తున్నప్పటికి, యింకా లైంగిక సమానత్వం దూరంగానే వుండడంపట్ల విచారం వ్యక్తంచేశారు.

ఏపిమాస్ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి మహాపర్ అలి ప్రసంగిస్తూ, ఈ మహా సమ్మేళనం నిర్వహణలో ఎస్ బి ఐ సహభాగస్వామిగా వుండడం తనకు చాలా సంతోషం కలిగిస్తున్నదని అన్నారు. ఆమె ఎస్ హెచ్ జి పురోగతిని ప్రశంసిస్తూనే, ఈ స్వయంసహాయ వ్యవస్థలో యింకా కొన్ని బలహీనతలు వున్నాయని, ఎస్ హెచ్ జిలను గ్రేడింగ్, రేటింగ్ చేసే వ్యవస్థ అవసరమని, అయితే, ఏపిమాస్ యిస్తున్న శిక్ష ణలు ఈ లోటును చాలావరకు భర్తీచేస్తున్నాయని, ఈ శిక్ష ణల స్ఫూర్తితో ఎస్ హెచ్ జిలు మరింత పటిష్ఠంగా రూపొందాలని కోరారు.

అనంతరం సెబి పూర్తికాలపు సభ్యుడు శ్రీ ఎస్ రామన్ తన జీవిత సంఘటన ఆధారంగా రూపొందించిన ‘

**బలహీనతలను వదులుకోవడం వల్ల కాదు, బలాలను పెంచుకోవడం వల్లనే లక్ష్యం సాధ్యం**

ఫ్రమ్ కార్ షెడ్ టు కార్నర్ సీట్ అండ్ బియాండ్' అనే పుస్తకావిష్కరణ జరిగింది. ఎస్ హెచ్ జి పి ఎఫ్ కార్యదర్శి శ్రీ తరుణ్ దేబనాథ్ వందన సమర్పణతో ప్రారంభ సమావేశం ముగిసింది.

తర్వాత 'మహిళల ఆధ్వర్యంలో విజయవంతంగా పురోగమించే బహుళ సేవల సంస్థలు ... మహిళల విశ్లేషణ' అనే అంశంపై జరిగిన సర్వప్రతినిధి సభలో రాజస్థాన్ లోని ఘూమర్ నుంచి శ్రీమతి చంపాబాయ్, జార్ఖండ్ సి ఎల్ ఎఫ్ నుంచి ఐత్వారీదేవి, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘంనుంచి శ్రీమతి సరస్వతి, కేరళనుంచి కుదుంబశ్రీ ప్రతినిధి, మధ్యప్రదేశ్ నుంచి శ్రీమతి సుధాబాగెల్, త్రిపుర నుంచి శ్రీమతి రీనా సిన్హా, పశ్చిమ బెంగాల్ నుంచి శ్రీమతి సీమా చౌధురి, మహారాష్ట్ర నుంచి వృషాలి దినకర్, బీహార్ నుంచి జహార్ ఖటూన్, అస్సాం నుంచి అంజూ బోరా తదితరులు ఎస్ హెచ్ జిలతో తమ అనుభవాలను పంచుకున్నారు.

రెండవ రోజు

ప్రదాన్ ప్రతినిధి శ్రీ అమితవ రక్షిత్ స్వాగతోపన్యాసంతో రెండవరోజు సమావేశాలు మొదలైనాయి. తొలుత 'సేవ' సంస్థకు చెందిన శ్రీమతి సవితా బెన్, శ్రీ దేబ్‌నాథ్, శ్రీమతి సుధా కొఠారి ఈ సమ్మేళనంలో తొలిరోజు ప్రసంగాలు, చర్చోపచర్చల సారాంశాన్ని క్లుప్తంగా వివరించిన పిదప రెండవ రోజు సర్వప్రతినిధి సభ 'ఎస్ హెచ్ జి సమాఖ్యలకు కొత్త రూపు యివ్వడం : మహిళా పారిశ్రామిక, వ్యాపార సంస్థల ఏర్పాటు, వ్యవసాయ రంగంలో ఎఫ్ పి ఓలను, విలువ గొలుసు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ' అనే అంశంపై జరిగిన సర్వప్రతినిధి సభలో ఎం పి ఎస్ ఆర్ ఎల్ ఎం నుంచి ఎం బెల్వాల్, ప్రదాన్ నుంచి శ్రీ మణీందర్, సృజన నుంచి శ్రీ ఆదిత్య కుమార్, టి ఆర్ ఐ ఎఫ్ నుంచి శ్రీ అభిషేక్ జోషి, ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు బి నుంచి శ్రీ ఎస్ ఎస్ భట్ తమ ఆలోచనలను పంచుకున్నారు.

అనంతరం ' సభ్యులకు మరింత మెరుగైన ఆర్థిక సేవలు అందించే, ఆర్థిక సుస్థిరత్వ సాధనకు దోహదంచేసే సంస్థలుగా ఎస్ హెచ్ జి సమాఖ్యలు' అనే అంశంపై మూడవ సర్వ ప్రతినిధి సమావేశం జరిగింది.

◆ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్ 'ఏ విజయాలు సాధించామని ఈ సంబరాలు' అంటూ చేసిన ఆలోచనాత్మక ప్రసంగం వివరాలు 8 వ పేజీలో

◆ పురస్కారాలు పొందిన సమాఖ్యల వివరాల పట్టిక 34 వ పేజీలో

**స్వయంపోషక సంస్థగా మావిమ్ !**

'మావిమ్' ఎం డి డాక్టర్ ఇందు జక్కర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సహాయసహకారాల మీద ఆధారపడకుండా, మావిమ్ స్వయం పోషక సంస్థగా రూపొందిందని చెప్పింది. మావిమ్ ప్రస్తుతం సభ్యులకు, సంస్థకు సొంత ఆస్తుల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు.

సిడ్బికి చెందిన శ్రీ ఆస్థానా మాట్లాడుతూ, తమ సంస్థ సూక్ష్మ రుణ సంస్థల అభివృద్ధికోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణలు యిస్తున్నదని, ప్రభుత్వ తోడ్పాటుతో సూక్ష్మ రుణ సంస్థలను బ్యాంకులుగా అభివృద్ధిచేసే ప్రతిపాదన వున్నదని చెప్పారు.

స్త్రీనిధి తెలంగాణా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జి వి ఎస్ రెడ్డి మాట్లాడుతూ, స్త్రీనిధి పాడి పరిశ్రమ రంగం, కోళ్ళ పెంపకం, సౌరశక్తి ప్రక్రియలు, విద్యుత్ వాహనాలు, వివిధ హరిత నవీకరణ కార్యక్రమాలకూర్థిక సహాయం అందిస్తున్నదని చెప్పారు.

ఎన్ ఆర్ ఎల్ ఎం మిషన్ మెనెజర్ శ్రీ సౌరవ్ రాయ్ మాట్లాడుతూ, బ్యాంకులు రుణాలు మంజూరు చేసే తీరు యిప్పుడు ఎంతో సరళంగా తయారైందని, బ్యాంకులు యిప్పుడు మహిళలకు, ఎస్ హెచ్ జిలకు అప్పులు యిస్తూ, తమ రుణ లక్ష్యాలను అధిగమించి అభివృద్ధిచెందుతున్నాయన్నారు.

**స్వతంత్ర సంస్థలుగా ఎదిగితేనే భవిష్యత్తు**

అనంతరం ' ఇండియాలో ఎస్ హెచ్ జి ఉద్యమ భవిష్యత్తు - విజన్ 2030: యిక్కడనుంచి ఎక్కడికి మన ప్రస్థానం?' అనే అంశంపై శ్రీ సి ఎస్ రెడ్డి మాట్లాడుతూ,

(మిగతా 15 వ పేజీలో)

# ఏ విజయాలు సాధించామని ఈ సంబరాలు ?

ఏపిమాస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10, 11 తేదీలలో హైదరాబాదులో జరిగిన 'స్వయంసహాయ సమాఖ్యల జాతీయ సమ్మేళనం, ఉత్తమ సమాఖ్యల పురస్కారోత్సవం'లో రెండవరోజున ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బుడితి రాజశేఖర్ చేసిన ప్రసంగం, మనదేశంలో స్వయంసహాయ రంగ అమోఘాభివృద్ధి పేరిట ప్రదర్శితమయ్యే వెలుగులచిత్రం వెనుక దాగిన వాస్తవిక చీకటి కోణాలను నిక్కచ్చిగా ఆవిష్కరించింది. 'స్వయంసహాయం' అనే ఆదర్శం ఎంత అర్థరహితంగా మారిందో, ఇబ్బడి ముబ్బడిగా బ్యాంకుల ఆర్థికాభివృద్ధికి సమాఖ్యలు ఎలా నిచ్చెనలుగా మారాయో ఆయన కూలంకషంగా వివరించారు. స్వయంసహాయ రంగానికి యిప్పుడు ఆత్మవిమర్శ, అంతరంగ సమీక్షణం ఎంతటి తక్షణావశ్యకమో శ్రీ రాజశేఖర్ ప్రసంగం నొక్కిచెప్పింది. ఆయన ప్రసంగ సారాంశాన్ని 'మహిళా సాధికారత' పాఠకులకోసం క్లుప్తంగా అందిస్తున్నాం.

1. 'మనం ఏ విజయాలు సాధించామని ఈ సంబరాలు జరుపుకుంటున్నాం? తాము ఎస్ హెచ్ జి లకు యిచ్చిన రుణాలను ఎస్ హెచ్ జి లు, ఎస్ ఆర్ ఎల్ ఎం ల తోడ్పాటుతో బ్యాంకులు దాదాపు నూటికి నూరుశాతం తిరిగి వసూలు చేసుకోగలిగినందుకా? ఎస్ హెచ్ జి లు ఫలప్రదమయ్యాయా లేదా అనే దానికి కొలమానాలు వాటి సభ్యుల జీవన ప్రమాణాల మెరుగుదల, నిరుపేదలు ఆస్తులు సమకూర్చుకోవడం.

2) తీసుకున్న రుణాలను ఎస్ హెచ్ జిలు తిరిగి చెల్లించే శాతం అత్యధికంగా వుండడం వెనుక దాగున్న కారణం బహుశా ఎప్పటికప్పుడు పాత రుణాలకు కొత్త రంగు పులమడం కావచ్చు. ఈ ధోరణి వ్యవసాయ రంగానికి బ్యాంకు రుణాల విషయంలో ఎప్పటినుంచో బాగా వున్నదే. పాత అప్పులు తీర్చడానికే కొత్తగా రుణాలు యివ్వడమా, లేక కేవలం ఖాతా పుస్తకాలలో లెక్కలు సరిచేయడమా?

3) బ్యాంకులు నిజంగానే హామీలేని రుణాలు యిస్తున్నాయా? ఎస్ హెచ్ జి ల పొదుపు మొత్తాలకు (జప్తుచేయగలిగే) చాలా స్వల్ప శాతం వడ్డీని విదిలిస్తూ, వారి ఖాతాల మొత్తాలను హామీగా పరిగణించడం కాదా? ఎస్ హెచ్ జి సభ్యులకు అనేక రకాల రుణాలు (అనేక ఆదాయాలు కాదు) , రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ డి బి టి పథకాల కింద గ్రాంట్లు అందుతుండడమే వారి తిరిగి చెల్లింపులు ఎక్కువగా వుండడానికి ఒక సూచిక కావచ్చు.

4) ఎస్ హెచ్ జి సభ్యుల కుటుంబాల వాస్తవిక ఆదాయాలు పెరిగాయా, మహిళల పేరిట మరింతగా ఆస్తులు సమకూరాయా, వారి పిల్లల చదువులు, ఆరోగ్యాలు , మహిళల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయా అనే అంశాల ఆధారంగా 20 ఏళ్ళకు పైగా సాగుతున్న పేదరిక నిర్మూలన ప్రయత్నాలు ఏ మేరకు సఫలమయ్యాయో తెలుసుకునే ప్రక్రియలను ఎన్ ఆర్ ఎల్ ఎం , ఎస్ ఆర్ ఎల్ ఎంలు రూపొందించి, ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలి

5) పేదరికాన్ని, పేద కుటుంబాల, ముఖ్యంగా మహిళల నిస్సహాయతను నివారించడంలో పాటించవలసిన మరో ముఖ్య విషయం నేడు ఎదురవుతున్న వివిధ ముప్పుల గురించి వారికి తగిన అవగాహన కల్పించడం .వాతావరణ మార్పులను గురించి, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించడంద్వారా వాతావరణ మార్పుల దుష్ఫలితాలను ఎలా అధిగమించవచ్చునో కూడా కూడా వారికి అవగాహన కలిగించడం అవసరం.

6) ఎన్ ఆర్ ఎల్ ఎం, ఎస్ ఆర్ ఎల్ ఎంలు కుటుంబాల ఆదాయాన్ని పెంచగలిగే, ముప్పులను తగ్గించగలిగే నూతన విధానాలను గురించి తీవ్రంగా ఆలోచించవలసిన, మరింత అంకితభావంతో అనుసరించవలసిన అవసరం ఎంతైనా వుంది. వాటి ఫలితాలను, ప్రభావాలను అవి ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా గమనిస్తుండాలి. స్వయంసహాయ



మహిళలు సాధిస్తున్న వాస్తవిక ఫలితాల గురించి, ఎదుర్కొంటున్న సమస్యలు, వైఫల్యాల గురించి నేరుగా వారినుంచి, వారి సంస్థలనుంచి విని, తెలుసుకుని వివేకంతో స్పందిస్తూ, ఎస్ హెచ్ జి ఉద్యమానికి అసలైన తోడ్పాటు అందించే సంస్థలుగా ఎన్ ఆర్ ఎల్ ఎం, ఎస్ ఆర్ ఎల్ ఎంలు రూపొందాలి.

కేవలం సొంత పొదుపులతోనే గణనీయమైన ఫలితాలు సాధిస్తున్న ' సేవ బ్యాంక్ ', ' సహవాసిక ' సహకార సంస్థల వంటి ఉదాహరణలు, మరెన్నో విజయగాధలు మన కళ్ళ ఎదురుగానే వున్నాయి కదా! ఈ సంస్థలన్నీ మహిళా సభ్యులు తామే స్వయంగా రూపొందించుకున్న విధానాలతో , స్వయం నిర్ణయాధికారం, స్వయం నియంత్రణ, స్వయం పర్యవేక్షణతో , స్వతంత్రంగా పనిచేస్తూ, తమ సభ్యుల తక్షణ అవసరాలను , భవ్యమైన భవిష్యత్తుకోసం ఏర్పడే అవసరాలను తీరుస్తూ మహిళల ఆధ్వర్యంలో విజయవంతంగా పనిచేయడం లేదా? ఈ నమూనాల నుంచి పాఠాలు నేర్చుకుని, కేవలం సభ్యుల నిర్వహణలో, నియంత్రణలో బహుళసేవలు అందించే సహకార వాణిజ్య సంస్థగా ఎస్ హెచ్ జి సమాఖ్య స్వరూపాన్ని తిరిగి కొత్తగా రూపొందించడం ప్రస్తుత తక్షణ కర్తవ్యం!

**ఏకైక వేదిక ఏపిమాస్ !**

బ్యాంకు రుణాలతో ఎస్ హెచ్ జి ఫెడరేషన్లు (స్వయంసహాయ సమాఖ్యలు) బాగుపడిందేమీ లేకున్నా, సమాఖ్యలకు అప్పులు అలవాటుచేసి, నూరుశాతం తిరిగి చెల్లింపులతో బ్యాంకులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న విచిత్ర, విపరీత పరిస్థితి గురించి తన ప్రసంగంలో కూలంకషంగా విశ్లేషించిన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిశ్రీ బుడితి రాజశేఖర్, కేవలం ప్రసంగంతో సరిపెట్టకుండా, తన అధికార పరిధిలో తదనంతర చర్యలకు తక్షణ శ్రీకారం చుట్టారు. ఆయన ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డికి పంపిన ఫోన్ సందేశంలో శ్రీ సి ఎస్ రెడ్డిని చర్చలకోసం విజయవాడకు ఆహ్వానించారు. స్వయంసహాయ ఉద్యమ స్ఫూర్తి కొనసాగేలా కృషిచేస్తున్నందుకు శ్రీ సి ఎస్ రెడ్డిని, ఏపిమాస్ సిబ్బందిని ఆయన అభినందించారు. 'మీరు, మీ బృందం అసలైన ఛాంపియన్లు' అని ఆయన కొనియాడారు.

స్వయంసహాయ ఉద్యమానికి సంబంధించిన విజయగాధలను పంచుకోవాలన్నా, ఉద్యమం ఎదుర్కుంటున్న సమస్యల గురించి చర్చించాలన్నా ఏపిమాస్‌లోనూ, ఇలాంటి వేదికలపైనకాక ఆ అవకాశం మరెక్కడ వుందని ఆయన ప్రశ్నించారు. ఈ రంగాన్ని గురించి కూలంకషమైన అవగాహనవున్న మీలాంటి వారు మాత్రమే వాస్తవ స్థితిని చెబుతారు, నిజాన్ని అభినందిస్తారు. ఎందుకంటే , మహిళలు బాగుపడాలని మనం కోరుకుంటాం కాబట్టి. సమాఖ్యల స్వయం నిర్వహణ, స్వయం నియంత్రణ గురించి, మాక్స్‌చట్టాన్ని గురించి కేవలం ఏపిమాస్ మాత్రమే మాట్లాడుతున్నది. ఈ ఆశయాలు నెరవేరాలంటే మనం కలసిపనిచేయడం అవసరం. మీకు తీరుబాటు అయినప్పుడు విజయవాడకు రండి. అనుసరించవలసిన వ్యూహాన్ని గురించి, ఏ ఏ అంశాలు ఎంత కాలంలోగా పూర్తిచేయాలో చర్చిద్దాం. మీ రాకకోసం ఎదురుచూస్తుంటాను' ■

**వెనుకబడినవారిని ముందు నడిచేలా ప్రోత్సహించడమే మంచి నాయకత్వ లక్షణం**

# యువశక్తితో ఎఫ్ పి ఓలకు నవశక్తి !

– ఎస్. ప్రహల్లాద, ఎన్. వినాయక రెడ్డి

స్వయంపోషక, స్వయం సమృద్ధి ఎఫ్ పి ఓలను (రైతు ఉత్పత్తిదారు సంస్థలను) ఏర్పరచి, వాటిద్వారా రైతులకు కావలసిన వివిధ రకాల మార్కెటింగ్ సేవలు కల్పించి, పంట వ్యయాలను తగ్గించి, రైతులు అభివృద్ధి చెందాలనే ఉన్నత ఆశయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఏపిమాస్ లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలు దేశవ్యాప్తంగా సన్నకారు, చిన్న రైతులతో రైతు ఉత్పత్తిదారు సంస్థలను ప్రోత్సహిస్తున్నాయి.

ఇందులో భాగంగా ఏపిమాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణా రాష్ట్రాల లో 84 ఎఫ్‌పిఓలను ఏర్పాటు చేసి సభ్య రైతులకు కావలసిన వివిధ రకాల మార్కెటింగ్ సేవలందిస్తున్నాయి. 'యువత తోనే దేశ భవిష్యత్' అని చాలా మంది మేధావులు వక్కాణించారు. అయితే ఇటీవల కాలంలో వ్యవసాయంలో కూడా నూతన సాంకేతిక పరిజ్ఞానం అంది పుచ్చుకొని, వ్యవసాయం చేయడంలో యువత పాత్ర గణనీయంగా పెరుగుతున్నది. అనేకమంది యువ ఇంజినీర్లు కూడా వ్యవసాయంవైపు మొగ్గు చూపుతున్నట్లు మనం వింటున్నాం.

> **రైతు ఉత్పత్తిదారు సంస్థల ప్రగతి యువతతోనే సాధ్యమవుతుందని సభ్యత్వ విషయంలోను, వ్యాపార లావాదేవీల లోను శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో నిరూపితమైంది. ఇంతేకాక యువరైతులు పాలక వర్గ సభ్యులుగా ఉన్నట్లయితే ఎక్కువ మంది సభ్యులకు నాణ్యమైన సేవలు అందించవచ్చునని కూడా నిరూపితమైంది.**

ఇటీవల ప్రాధాన్యత సంతరించుకుంటున్న రైతు ఉత్పత్తిదారు సంస్థలలో కూడా యువ రైతులు చురుకుగా పాల్గొంటుండడాన్ని మనం గమనిస్తున్నాం. ఇప్పటివరకు అందుబాటులోని లెక్కలను చూసినట్లయితే రైతు ఉత్పత్తిదారు సంస్థలలో యువత 21 నుండి 30 శాతం మంది వున్నారు. ఇందులో పురుషులే అధికంగా వున్నారు.

**చురుకుగా పాల్గొంటున్న యువరైతులు**

యువరైతులు రైతు ఉత్పత్తిదారు సంస్థల కార్యక్రమాలలో, ముఖ్యంగా రైతు ఉత్పత్తిదారు సంస్థల ప్రాముఖ్యతను సభ్య రైతులకు తెలియజేయడంలోను, సభ్యులను సమీకరించడం లోను, వారికి కావలసిన వివిధ రకాల సేవలను అందించడం లోను చురుకైన పాత్ర పోషిస్తున్నారు. వారి నాయకత్వంలో రైతు ఉత్పత్తిదారు సంస్థలు వేగంగా ముందడుగులు వేస్తున్నాయనడానికి చిత్తూరు జిల్లా, పుంగనూరు బ్లాకులో ఏపిమాస్ ద్వారా ఏర్పాటైన శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తిదారు సంస్థ ప్రగతిని మచ్చుతునకగా చెప్పవచ్చు.

ఈ సంస్థ 10.08.2023వ తేదీన తన ద్వితీయ వార్షిక మహాసభను నిర్వహించింది. ఈ సభలో జరిగిన వార్షిక ఎన్నికలలో పాలక వర్గంలోకి ఆరుగురు యువ రైతులు ఎన్నిక అయ్యారు.

వారిలో శ్రీ ఎం. హరికిషన్‌రెడ్డి అధ్యక్షులుగా, శ్రీ చంద్రశేఖర్ రెడ్డి, శ్రీ జయపాల్, శ్రీ రెడ్డెప్ప, శ్రీమతి సుజాత, శ్రీగణేష్ పాలకవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. శ్రీ హరికిషన్ రెడ్డి, శ్రీ చంద్రశేఖర్ రెడ్డిలకు కూరగాయల పంటలకు, ప్రధానంగా టమాట పంటకు ఆశించే వివిధ రకాల క్రిమి కీటకాలు, వాటి నివారణ కు పిచికారీ చేయవలసిన వివిధ రకాల మందులపై మంచి అవగాహన వుంది. అందువలన వారి పంటలకు వినియోగించే వివిధ కంపెనీల ఎరువులను, పురుగు మందు లనే రైతు ఉత్పత్తిదారు సంస్థ దుకాణంలో విక్రయిస్తున్నారు. ఇక గడచిన సంవత్సరంలో 100 మంది రైతులు సభ్యులుగా చేరితే , గత మూడు నెలలలోనే మరో 100 మంది సభ్యులుగా చేరారు. ఇంత తక్కువ సమయంలో ఎక్కువ మంది సభ్యులను సమీకరిండంలో యువపాలక



వర్గ సభ్యుల పాత్రే కీలకమైనదని చెప్పవచ్చు.

**ఇందుకోసం వారు అవలంబించిన వ్యూహాలు:**

- పాలకవర్గ సభ్యులు రైతు ఉత్పత్తిదారు సంస్థను తమ స్వంత సంస్థగా భావించడం
- ఏపిమాస్ , ఎఫ్.పి.ఓ సిబ్బందితో పాటు గ్రామాలను సందర్శించి, తోటి రైతులకు నచ్చచెప్పడం
- తాము స్వయంగా ఉపయోగించే ఎరువులను, క్రిమి సంహారకాలనే సంస్థలో విక్రయిస్తుండడం
- ఆ పురుగు మందులను వాడడం వల్ల తమ పంటలలో రోగాలు తగ్గాయని చెప్పడం
- ఇతర దుకాణాల కంటె మన సంస్థలో మందులను కొంటే ఎక్కువ డబ్బులు ఆదా చేయవచ్చని చెప్పడం.
- రైతు ఉత్పత్తిదారు సంస్థలో చేరాలంటే ప్రతి రైతు సభ్యత్వ రుసుం, వాటాధనం మొత్తం రూ.లు.1100 చెల్లించ వలసి వుంటుంది. అయితే, సభ్య రైతులు ఇతర దుకాణాలలో కాకుండా రైతు ఉత్పత్తిదారు సంస్థలో ఒకేసారి రూ.6000 విలువగల మందులను కొనుగోలు చేస్తే రైతులు చెల్లించిన రూ.1100 మిగులు తుందని తెలియజేయడం. ఇలా కొన్న ప్రతిసారి డబ్బులు మిగులుతాయని చెప్పడం. అంతేగాక సభ్య రైతులు చెల్లించిన వాటాధనం అలాగే పెట్టుబడిగా ఉంటుందని నచ్చచెప్పడం.
- ప్రతి రైతుకు చుట్టుపక్కల గ్రామాలలో పరిచయాలు వుంటాయి. ఆ పరిచయాలను వినియోగించి రైతులకు నచ్చచెప్పి సభ్యత్వం కట్టించడం.
- సభ్యత్వ రుసుం, వాటాధనం చెల్లించిన వారికి వారి ఇంటివద్దనే వాటాధన ధ్రువపత్రాలు అందజేయడం.
- వీలునుబట్టి రోజూ లేదా రెండు రోజులకు ఒకసారి సంస్థ దుకాణంలో కూర్చొని వచ్చే రైతులకు వివిధ రకాల మందులపై అవగాహన కల్పించడం. అవసరాన్నిబట్టి, సందేహాలు వున్న రైతులకు ఫోన్ ద్వారా క్రిమి సంహారక మందులను , ఎరువులను సిఫార్సు చేయడం.
- టమాట పంటలకు సోకే వివిధ రకాల జబ్బులను అరికట్టడానికి ఒక్కొక్క సారి రెండు లేదా మూడు రకాలు మందులు కలిపి పిచికారి చేయవలసి వుంటుంది. అయితే, ఈ రెండు లేదా మూడు రకాలు ఏఏ మందులు కలిపి పిచికారి చేయాలనేది చాలా ముఖ్యమైన అంశం. ఈ విషయంలో కూడా సభ్యరైతులకు, సంస్థ సిబ్బందికి చక్కని సలహాలు యివ్వడం.
- సభ్యులు చెల్లించిన వాటా ధనానికి భరోసా ఇవ్వడం
- సంస్థ పాలకవర్గ సమావేశాలకు సకాలంలో హాజరై మిగతా సభ్యులకు మార్గ దర్శకంగా వుండడం
- ప్రాంతీయ స్థాయిలో జరిగే రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమాఖ్య సమావేశంలో పాల్గొని సమావేశ విశేషాలను తమ సంస్థ సమావేశంలో తెలియజేయడం




**సౌకర్యాలే ఆనందానికి మూలమనుకోవడం కేవలం అవివేకం**



- ఏ నెలలో ఎటువంటి ఎరువులకు లేదా క్రిమి సంహారక మందులకు గిరాకి వుంటుందో చర్చించడం, వాటికి ఇండెంట్ ఇవ్వడంలో సముచిత పాత్ర పోషించడం.
- లెక్కలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంలో, సిబ్బందికి తగు సూచనలు చేయడం
- వివిధ రకాల ప్రభుత్వ అధికారులతో సత్సంబంధాలు నెలకొల్పడంలోను, ప్రభుత్వ పథకాలు రైతులకు అందేవిధంగా చూడడంలోను ఉత్సాహం చూపడం
- శ్రీ సుగుటూరు గంగమ్మ రైతు ఉత్పత్తిదారు సంస్థకు స్వంతంగా భవన నిర్మాణం చేయుటకు కావలసిన స్థలం ప్రభుత్వం నుండి కేటాయించుకొనుటకు వివిధ రకాల ప్రయత్నాలు జరిగాయి. మొదట జిల్లా మంత్రి గారికి వినతి పత్రం ఇవ్వడం మొదలు తహసిల్దారును కలవడం, మండల పరిషత్ అధ్యక్షులను కలిసి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం జిల్లా కలెక్టరు ఆమోదం కొరకు పంపడం జరిగింది. ఈ కార్యక్రమం లో యువఅధ్యక్షులు ప్రధాన భూమిక పోషించారు.

మొత్తంమీద పాలకవర్గంలోకి అధిక శాతం మంది యువ రైతుల రాకతో సంస్థ కార్యక్రమాలు ముఖ్యంగా సభ్యత్వం లోను, వ్యాపారంలోను వేగం పెరిగిందనడంలో అతిశయోక్తి లేదు. ఇతర రైతు ఉత్పత్తిదారు సంస్థలు కూడా యువ రైతులకు ప్రాధాన్యత యిచ్చి తమ సంస్థలను సుస్థిరాభివృద్ధి దిశగా ముందుకు నడుపుతారని ఆశిద్దాం. ■

## 6 పంటల మద్దతు ధరల పెంపు

**రబీ** సీజన్‌కు సంబంధించి గోధుమ, బార్లీ సహా మొత్తం 6 ప్రముఖ పంటల కనీస మద్దతు ధరలను (యంఎస్‌పి) కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో 18.10.23న సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

2024-25 రబీ సీజన్‌కు గానూ గోధుమ, బార్లీ, సన్‌ఫ్లవర్, శనగ, ఆవాలు, కంది పంటలకు కనీస మద్ధతు ధర పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో అత్యధికంగా గోధుమ పంటలకు క్వింటాలుకు రూ. 150 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం ప్రకారం గోధుమల కనీస మద్దతు ధరను రూ. 150 పెంచడంతో క్వింటా గోధుమల ధర రూ. 2, 275కు చేరింది.

**పెరిగిన కనీస మద్దతు ధరలు ...**

- గోధుమల కనీస మద్దతు ధర రూ.150 పెంపుతో క్వింటాల్ గోధుమల ధర రూ. 2,275కు పెరిగింది.
- బార్లీ పంటపై రూ. 115 పెంపుతో క్వింటాల్ రూ. 1850కి చేరింది.
- శనగ పంటపై రూ. 105 పెంపుతో క్వింటాల్ శనగ ధర రూ. 5,440కి చేరింది.
- కంది పంటపై రూ. 425 పెంచడంతో క్వింటాల్‌కు ధర రూ. 6,425కు పెరిగింది.
- ఆవాలపై రూ. 200 పెంపుతో క్వింటాల్ ధర రూ. 5, 650కి చేరింది.
- పొద్దుతిరుగుడు పంటపై రూ. 150 పెంచడంతో క్వింటాల్ ధర రూ. 5,800కు పెరిగింది.

**కరువు భత్యం పెంపు**

ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు కరువు భత్యం పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కరవు భత్యాన్ని 4 శాతం పెంచి 42 శాతం నుంచి 46 శాతం చేసింది. ■

# ప్రకృతి సేద్యంతో తగ్గనున్న నిరుద్యోగం !

## రైతులకు అధిక ఆదాయం

రసాయనిక సేద్యం భూముల్ని బీళ్ళుగా మార్చుతుంటే... ప్రకృతి సేద్యం బీళ్లను సాగులోకి తెస్తుంది. ప్రకృతి సేద్యంతో 2050 నాటికి నిరుద్యోగం రేటు 31 నుంచి 7 శాతానికి తగ్గుతుంది. ప్రకృతి విపత్తులను దీటుగా... తట్టుకోవడం ప్రకృతి సేద్యం తోనే సాధ్యం. దీనివల్ల రైతుల ఆదాయం అధికం అవుతుంది.

జనాభా పెరుగుదల – ఉపాధి అవకాశాలు, ఆర్థిక పురోగతి– అసమానతలు, నేల వినియోగం, దిగుబడి– ఆహార ఉత్పత్తి తదితర కోణాల్లో రెండు విభిన్న సాగు పద్ధతుల్లో పొందే ఫలితాల్లో వ్యత్యాసాలను అధ్యయనం చేసి ఈ నివేదికలో పొందుపరిచారు.



రసాయనాలతో కూడిన పారిశ్రామిక వ్యవసాయం ఇలాగే కొనసాగితే 2050 నాటికి రైతుల సంఖ్య సగానికి తగ్గుతుంది. నిరుద్యోగం రేటు 31 శాతం నుంచి 30 శాతానికి తగ్గుతుంది. అయితే, పూర్తిగా వ్యవసాయం చేపడితే రైతుల సంఖ్య కోటికి పెరుగుతుంది. నిరుద్యోగం రేటు 7 శాతానికి తగ్గుతుంది.

ప్రకృతి వ్యవసాయం ద్వారా బంజరు భూములు కూడా సాగులోకి వస్తాయి. అధిక విస్తీర్ణం సాగులో అత్యధిక మంది రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతారు. తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా రసాయన రహిత సురక్షిత పంటలు పండిస్తారు. అందువల్ల అధిక మార్కెట్ ధర పొందుతారు.

ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తనాలు, నీటి వినియోగం, రసాయనాలు, ఇంధనం, అప్పులు, భారీ యంత్ర సామగ్రి తదితర ఖర్చుల విషయంలో రైతులకు ఎంతో డబ్బు ఆదా అవుతుంది. ఈ రైతులు పంట ఉత్పత్తులను విలువ జోడించి అమ్ముతారు కాబట్టి అధిక ఆదాయం వస్తుంది. ప్రకృతి వ్యవసాయంలో నిరుద్యోగం తగ్గి, వ్యవసాయ వ్యవసాయేతర వేతనాల్లో అంతరం కారణంగా ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారు. ఆర్థిక వృద్ధి 6.5%కి చేరుకుంటుంది.

రసాయనిక వ్యవసాయం కొనసాగిస్తే 2050 నాటికి ఇది 6.1 పైసలు మాత్రమే ఉంటుంది. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతు ఉత్పత్తి చేసిన ప్రతి కిలో కేలరీల ఆహారానికి 10.3 పైసల ఆదాయం పొందుతారు.

రసాయనిక వ్యవసాయం కొనసాగిస్తే 2019లో 62 లక్షల హెక్టార్లున్న సాగు భూమి విస్తీర్ణం 2050 నాటికి 55 లక్షల హెక్టార్లకు తగ్గుతుంది. కొన్ని పంటలపై మాత్రమే దృష్టి కేంద్రీక రించే పారిశ్రామిక వ్యవసాయ విధానంలో బీడు భూముల విస్తీర్ణం 2019లో 24 లక్షల హెక్టార్ల నుంచి 2050 నాటికి 30 లక్షల హెక్టార్లకు పెరిగే ప్రమాదం ఉంది.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీడు భూములు కూడా సాగులోకి వచ్చి 2019లో 62 లక్షల హెక్టార్లున్న సాగు భూమి 2050 నాటికి 80 లక్షల హెక్టార్లకు పెరుగుతుంది. పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగి ప్రస్తుత సవాళ్లను అధిగమించవచ్చు.

రసాయన సేద్యంలో మొత్తం మీద తక్కువ భూమి, తక్కువ మంది రైతులు, అధిక సాగు ఖర్చులు, అధిక నిరుద్యోగ రేటుతో కలిపి వ్యవసాయ జివిఏ పెరుగుదల రేటు సగటున సంవత్సరానికి 4% నుంచి 3.5%కి తగ్గుతుంది.

ప్రకృతి వ్యవసాయం నేల ఆరోగ్యాన్ని పెంపొందించి

సారవంతమైన భూములను అందిస్తుంది. అనేక రకాల పంటలతో పంట సాంద్రత ఏర్పడుతుంది. ప్రకృతి వ్యవసాయం అనుసరిస్తున్న రైతులు దిగుబడిలో ఎలాంటి తగ్గుదల లేకపోవడమే కాకుండా, అధిక దిగుబడిని కూడా సాధిస్తున్నారు. వర్షాధార వ్యవసాయ భూముల్లోనూ పలు రకాల పంటల సాంద్రత వల్ల మరింత దిగుబడిని సాధిస్తున్నారు. మొత్తానికి ప్రకృతి వ్యవసాయంలో రైతులు 2019లో హెక్టారుకు రోజుకు 31,000 కిలో కేలరీల ఆహారాన్ని ఉత్పత్తి చేశారు. 2050 నాటికి అది 36,000 కిలో కేలరీలకు పెరుగుతుంది.

రసాయనిక వ్యవసాయంలో 2050 నాటికి రైతులు రోజుకు హెక్టారుకు దాదాపు 44,000కిలోకేలరీలు ఉత్పత్తి చేసినా.. ప్రకృతి సేద్యంలో పండే పంట ఉత్పత్తులు స్థూల, సూక్ష్మ పోషకాలు, పీచు పదార్థంతో కూడిన బలవర్థకమైన, సమతుల్యమైన ఆహారాన్నందిస్తాయి. రెండు విభిన్న పద్ధతుల్లో ఆహారోత్పత్తి, సాగు విస్తీర్ణం, వార్షిక దిగుబడులను అంచనా వేసి చూస్తే...2050లో ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉండే ఆహారం రసాయనిక వ్యవసాయం(4050 కిలో కేలరీలు / తలసరి/రోజు)లో కంటే ప్రకృతి వ్యవసాయం (5000 కిలో కేలరీలు/తలసరి రోజు) లో గణనీయంగా పెరుగుతుంది. అంతేగాక ప్రకృతి సేద్యంలో పండించిన పంట ఉత్పత్తులు రసాయనిక ఉత్పత్తుల కంటే మరింత సమతుల్యంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తట్టుకొనే విధంగా వ్యవసాయ పంటల జీవ వైవిధ్యం పెరుగుతుంది. సేంద్రియ కర్బనం నేలల్లో వృద్ధి చెందుతుంది. తద్వారా వాతావరణ మార్పులనుంచి ఉపశమనం కలుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, కరువు, తుపాన్లు, వరదలు వంటి వాతావరణ విపత్తులను తట్టుకోవడం రసాయనిక సేద్యంతో సాధ్యం కాదని నివేదిక స్పష్టం చేస్తోంది. పెట్టుబడి తగ్గటం, సురక్షిత నీటితో పాటు విస్తృత స్థాయిలో 'పౌష్టికాహారం అందించడం, పర్యావరణ పరిరక్షణవల్ల రాష్ట్రం 'రైతు అభివృద్ధి'కి దిక్సూచిగా మారుతుంది.

– సాక్షి సౌజన్యంతో

■

## నాలుగు పురుగుమందుల వాడకంపై నిషేధం

**కేం**ద్ర ప్రభుత్వం నాలుగు పురుగుమందుల వాడకంపై నిషేధం విధించింది. మరో ఏడు పురుగుమందులను కొన్ని పంటలకు ఉపయోగించకూడదని ఆంక్షలు జారీచేసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. డైకోఫోల్, డైనోక్యాప్, మెథోమిల్, మోనోక్రోటోఫాస్‌ల వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. ఇందులో తొలి మూడు మందులకు ఇచ్చిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, విక్రయాలు, పంపిణీని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మోనోక్రోటోఫాస్ వినియోగంపై మాత్రం కొంత సడలింపులిచ్చింది. ప్రస్తుతానికి మోనోక్రోటోఫాస్ 36% ఎస్ఎల్ ఫార్ము లేషన్‌ను డిస్‌కంటిన్యూ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇక మీదట ఈ మందు తయారీకి కొత్త రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేయబోమని తెలిపింది. అయితే కొన్ని పంటల్లో కొన్ని పురుగులను నియంత్రించడానికి వీలుగా మోనోక్రోటోఫాస్‌లోని ప్రత్యామ్నాయ ఫార్ములేషన్ల వాడకాన్ని మరో ఏడాదిపాటు అనుమతించనున్నట్లు తెలిపింది. ■

## కాంట్రాక్టు ఉద్యోగినికీ ప్రసూతి సెలవులు

**కాం**ట్రాక్టు ఉద్యోగినికీ ప్రసూతి సెలవులు ఇవ్వాల్సిందేనని ఢిల్లీ హైకోర్టు స్పష్టంచేసింది. ప్రసూతి సెలవులను నిరాకరించడం అమానవీయమని పేర్కొంది. కాంట్రాక్టు ఉద్యోగమనే సాకు చెప్పి సెలవులను నిరాకరించడం ఆమె ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని తెలిపింది. ఢిల్లీ యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో సహాయకురాలిగా పని చేస్తున్న ఓ ఉద్యోగిని ప్రసూతి సెలవులు తీసుకోగా.. ఆమెను యూనివర్సిటీ సర్వీస్ నుంచి తొలగించింది. దీనిపై ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కాంట్రాక్టు ఉద్యోగం అయినంత మాత్రాన నోటీసులు లేకుండా ఉద్యో గంనుంచి తొలగించడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. వెంటనే ఆమెను సర్వీసులోకి తీసుకొని, నష్టపరిహారంగా 50 వేల రూపాయలు చెల్లించాలని ధర్మాసనం యూనివర్సిటీని ఆదేశించింది. ■

**మరో అడుగేస్తే విజయమే అనేది తెలియక విరమించడాన్ని మించిన వైఫల్యమేముంటుంది?**

# స్వశక్తి ప్రాధాన్యతను చాటిచెప్పిన మహా సమ్మేళనం !




(7 వ పేజీ తరువాయి)

ఎస్ హెచ్ జి ఉద్యమ భవిష్యత్తు అవి ఏ మేరకు వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలను నిర్వహిస్తాయనేదానిమీద ఆధారపడి వుంటుందని అన్నారు. సమాఖ్యలు స్వయం నిర్ణయాధికారంతో, స్వతంత్రంగా పనిచేయాలని ఆయన కోరారు. ఎస్ హెచ్ జి ల సుస్థిరాభివృద్ధికి మూడు రకాల ఆదాయమార్గ సూత్రాన్ని ఆయన ప్రతిపాదించారు. అవి:

1) ఎస్ హెచ్ జిలు యిచ్చే అప్పులపై వడ్డీ రూపంలో మూడవ వంతు ఆదాయం

2) బ్యాంక్ కరస్పాండెంట్లు, సి ఎం ఆర్ సి మాదిరిగా ఎస్ హెచ్ జి ల సేవలకు సేవా రుసుం రూపంలో మరో మూడవ వంతు ఆదాయం

3) ఇతర వ్యాపారాల ద్వారా యింకో మూడవ వంతు ఆదాయం

సమాఖ్యలు రుణాలు సమకూర్చే, వ్యాపారాలను ప్రోత్సహించే, మరీ ముఖ్యంగా సమాజ ప్రయోజనాలను కాపాడే బహుళ సేవా వేదికలుగా రూపొందాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమగ్ర విధానం వల్ల ఎస్ హెచ్ జి సభ్యులు, ఆ సంస్థలు ఆర్థికంగా పురోగమించడంతోపాటు, దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని, ఇంకా విద్య, ఆరోగ్యం, వాష్, లైంగిక సామంజస్య ప్రతిపత్తి వంటి అనేక అంశాలు మెరుగుపడడానికి తోడ్పడుతుందని శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొన్నారు.

ఎస్ హెచ్ జి ల కోసం ఎస్ బి ఐ సరళీకృత విధానాలు

ఎస్ బి ఐ సి జి ఎం శ్రీ శంతను ఎస్ హెచ్ జి లతో తమ బ్యాంకు అనుసంధాన ప్రస్థానాన్ని వివరించారు. ఐదు లక్షల రూపాయలకు మించని రుణాల విషయంలో దరఖాస్తు ప్రక్రియను తమ బ్యాంక్ ఎంతో సరళీకృతంచేసిందని ఆయన చెప్పారు.

**ఎస్ హెచ్ జి ల కోసం నాబార్డ్ ప్రత్యేక విభాగం**

నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల మాట్లాడుతూ, సమాఖ్యలు సరైన వ్యాపారాలను ఎంపికచేసుకునేలా వారికి తగిన అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. ఈ అవసరాన్ని గుర్తించి, ఎస్ హెచ్ జి లకు వివిధ విలువపెంపు కార్యకలాపాలపై అవగాహన కలిగించే ఒక విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసినట్టు ఆమె చెప్పారు.

అనంతరం నాటి ప్రధాన ఆకర్షణ అయిన ఉత్తమ సమాఖ్యలకు పురస్కార ప్రదానంతో ఈ రెండు రోజుల సమ్మేళనం విజయవంతంగా ముగిసింది. ■

నిన్నటి విషాదం రేపటి వినోదంకావచ్చు

# ఔత్సాహిక రైతులకు పశుపోషణ ప్రాజెక్టులు!

**ఆం**ధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశు సంవర్ధక శాఖ వారు గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతి మిషన్ నిధులతో 2021-2022 నుండి 2025-26 సంవత్సరాల కాలపరిమితిలో ఔత్సాహిక రైతులను వ్యాపార సరళిలో ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ పథకంలో గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ళ పెంపకం, పందుల పెంపకం, పశు గ్రాసం, దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అసంఘటితంగా ఉన్న పశు సంవర్ధక రంగాన్ని వ్యవస్థీకృత రంగంలోకి తీసుకువచ్చి పాలు, గ్రుడ్లు మాంసం ఉత్పత్తిని పెంచి, వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తుంది.

**వివిధ ప్రాజెక్టుల వివరాలు:**

గొర్రెలు, మేకల పెంపకం యూనిట్ పథకంలో 500 గొర్రెలు, 25 పొట్టేళ్ళతో కూడిన యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రె లేదా మేక పిల్లల ఉత్పత్తి, పోషణ చేపట్టడం జరుగుతుంది.

**రాయితీలు వర్తించే తీరు ...**

| గొర్రె / మేకల ఫారము యూనిట్ | రాయితీ (గరిష్ఠంగా) రూ.లలో |
|---|---|
| 100 గొర్రెలు మేకలు + 5 పొట్టేళ్ళు / మేకపోతులు | 10 లక్షలు |
| 200 గొర్రెలు / మేకలు + 10 పొట్టేళ్ళు / మేకపోతులు | 20 లక్షలు |
| 300 గొర్రెలు / మేకలు + 15 పొట్టేళ్ళు / మేకపోతులు | 30 లక్షలు |
| 400 గొర్రెలు / మేకలు + 20 పొట్టేళ్ళు / మేకపోతులు | 40 లక్షలు |
| 500 గొర్రెలు / మేకలు + 25 పొట్టేళ్ళు/మేకపోతులు | 50 లక్షలు |



కోటి రూపాయలు, అంతకుమించి ప్రాజెక్టు విలువ ఉన్నచో గరిష్ఠంగా రూ.50 లక్షలు రాయితీ మంజూరు చేయబడును. అంతకన్నా తక్కువ ఉన్నచో, ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేయబడును.

- **కోళ్ళ అభివృద్ధి పథకం** లో తక్కువ వ్యయంతో కుడిన సాంకేతికతతో 1000 పెట్టలు + 100 పుంజులు సామర్థ్యం గల పెరటి కోళ్ళ యూనిట్ కోడి పిల్లల ఉత్పత్తి యూనిట్ మరియు పొదుగు కోళ్ళ యూనిట్ ఏర్పాటు చేయడం జరుగు తుంది. రూ.50 లక్షల మొదలుకొని అంతకుమించి ప్రాజెక్టు ఖరీదు ఉన్నచో గరిష్ఠంగా రూ.25 లక్షలు రాయితీ మంజూరు చేయబడును. అంతకన్నా తక్కువ ఉన్నచో ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేయబడును.
- పందుల పెంపకంలో 100 ఆడపందులు మరియు 10 మగ పందులతో కూడిన యూనిట్ ఏర్పాటు చేసి దీని ద్వారా పందిపిల్లల ఉత్పత్తి మరియు పోషణను చేపట్టడం జరుగుతుంది. రూ.60 లక్షలు మొదలుకొని అంతకుమించి ప్రాజెక్టు ఖరీదు ఉన్నచో గరిష్ఠంగా రూ.30 లక్షలు రాయితీ మంజూరు చేయబడును. అంతకన్నా తక్కువ ఉన్నచో ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేయబడును. అదే విధముగా 50 ఆడ పందులు + 5 మగ పందుల యూనిట్ ఏర్పాటు కొరకు గరిష్ఠంగా రూ.15 లక్షలు వరకు రాయితీ అందించబడును.
- పశుగ్రాసం మరియు దాణా అభివృద్ధి పథకంలో సైలేజి తయారీ యూనిట్, పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్ మరియు సమీకృత దాణా తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. సైలేజీ తయారీ యూనిట్ సమీకృత

దాణా మరియు పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్లకు కోటి రూపాయలు మొదలుకొని అంతకుమించి ప్రాజెక్టు విలువ ఉన్నచో గరిష్ఠంగా రూ.50 లక్షలు రాయితీ మంజూరు చేయబడును. అంతకన్నా తక్కువ ఉన్నచో ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేయబడును.

ఈ కార్యక్రమముల ద్వారా గ్రామీణ స్థాయిలో పశూత్పత్తులైన పాలు, మాంసం, గ్రుడ్ల ఉత్పత్తిని పెంచుకుని అధిక ఆదాయం పొందడం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధిని కల్పించి సుస్థిరతను, ఆత్మనిర్భరతను సాధించవచ్చు. ఎగుమతుల ద్వారా విదేశీ మాదకద్రవ్యాన్ని కూడా ఆర్జిస్తూ దేశ ఆర్థిక పురోగమనంలో పాలు పంచుకోగలరు.

**లబ్ధిదారుల అర్హతః**

అనుభవం గల వ్యక్తిగత పశుపోషకులు, రైతు ఉత్పాదకత సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్-8 కంపెనీల నుండి అర్హతను బట్టి లబ్ధిదారులను ఈ క్రింద చెప్పబడిన విధంగా ఎంపిక చేయడం జరుగుతుంది.

**లబ్ధిదారుల ఎంపిక విధానం:**

1. లబ్ధిదారు సంబంధిత ప్రాజెక్టు అంశంపై శిక్షణ పొందివుండాలి లేదా ప్రాజెక్టు నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి.
2. లబ్ధిదారు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు నివేదికను తయారుచేసి పోర్టల్లో అప్లోడ్ చేయాలి.
3. రాయితీపోను మిగిలిన యూనిట్ ఖరీదు కోసం బ్యాంక్ రుణం పొందడానికి అవసరమైన పత్రాలను సమర్పించి బ్యాంకు అనుమతి పొంది ఉండాలి.
4. లబ్ధిదారు తన సొంత భూమి లేదా కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి.
5. వీటిని రాష్ట్ర స్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ పరిశీలిస్తుంది.
6. నిబంధనల ప్రకారం అర్హతలున్న వారిని ఎంపికచేసే నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌కు పంపిస్తారు.

**సబ్సిడీ విడుదల విధానం:**

- 50 శాతం సబ్సిడి ప్రాజెక్టు ప్రకారం రెండు దఫాలుగా విడుదల చేయబడుతుంది.
- బ్యాంక్ వారు మొదటి దశ రుణాన్ని లబ్ధిదారుకు అందించారు అనే విషయాన్ని అధికారులు ధృవీకరించుకొన్న తర్వాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తం రుణం మంజూరు చేసిన బ్యాంక్ వారికి జమ చేయబడుతుంది. ఆ సబ్సిడీని బ్యాంకు వారు లబ్దిదారు ఖాతాలో జమ చేస్తారు.
- ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత అధికారులు ధృవీకరించుకొని రెండవ దఫా సబ్సిడీకి లబ్దిదారులను అర్హులుగా పరిగణిస్తారు.

▶ దరఖాస్తు డాక్యుమెంట్లను https://www.apurban.com/Tenders Display.aspx నుండి పొందవచ్చు.

▶ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్), సాంకేతిక తోడ్పాటు కోసం ఈ క్రింది వారిని సంప్రదించగలరు.

కె. దీవు - ఫోన్: 9704094969 , డా. లక్ష్మీనారాయణ రెడ్డి - ఫోన్: 8790997387

డా. ఆర్. అమరేంద్రకుమార్, సంచాలకులు, పశుసంవర్ధర శాఖ, ఆంధ్రప్రదేశ్.

డా.వై. సింహచలం- అదనపు సంచాలకులు, SMILE, విశాఖపట్నం ...

■

**జీవితంలో ఇంద్రధనుస్సు మెరవాలంటే తుపానులకు కూడా సిద్ధంకావాలి**

# స్త్రీలలో పోషకాహార లోపాలు... నివారణోపాయాలు !

సాధారణంగా భారతీయ మహిళలు అనేక పోషక లోపాలతో బాధపడుతూ ఉంటారు. స్త్రీలు పోషక లోపాలను కలిగి ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. చాలామంది మహిళలు సరైన, మేలైన ఆహారం తీసుకోరు. కొందరికి తినేందుకు సమయం కూడా ఉండదు. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం అంటే ఏమిటో కూడా వారికి తెలియదు.

ఇంట్లో వాళ్ల అందరి కోసం వండి పెట్టే మహిళలు... వారు తినే విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తారు. తిండి విషయంలో మహిళలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి, సమతుల్య, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే,,, సాధారణ, పోషక లోపాలను నివారించవచ్చు. అందుకే మహిళలు ఎదుర్కొనే కొన్ని సాధారణ పోషక లోపాలు, వాటి పరిష్కార మార్గాలను తెలుసుకుందాం.

**ఇనుము లోపము:**

రుతుస్రావం కారణంగా మహిళల్లో ఇనుము లోపం చాలా సాధారణంగా ఎదురవుతూ ఉంటుంది. శాకాహారులలో కూడా ఇది కనిపిస్తుంది. ఈ లోపం వలన రక్తహీనత, అలసట, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ, తేలికపాటి తలనొప్పి, మైకము, తలనొప్పి, మెదడు పనితీరు బలహీనపడవచ్చు. స్కిన్ పల్లర్, లేత కండ్లకలక, సన్నని పుటాకార గోర్లు వంటి సంకేతాలు ఇనుము లోపాన్ని తెలియజేస్తాయి. జనుము లోపం లేకుండా ఉండాలంటే ఎర్ర మాంసం, చికెన్, చేపలు, రాజ్మా, కాయధాన్యాలు, గుమ్మడికాయ గింజలు, నువ్వులు, జీడిపప్పు, బచ్చలికూర వంటి ముదురు ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలి. జంతు వనరులు ఇనుమును అందిస్తాయి.

ఇనుము అధికంగా ఉండే ఆహారాలతో పాటు విటమిన్-సి ఆహారాలను జోడించడం మంచిది. ఇనుము శోషణను నిరోధించే ఆహారాలను నివారించాలి. టీ, కాఫీతో పాటు కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు కొన్ని జనుము శోషణకు ఆటంకం కలిగిస్తాయి.

**విటమిన్ డి లోపం:**

విటమిన్ డి కొవ్వులో కరిగే విటమిన్ ఆరోగ్యకరమైన జుట్టు, ఆరోగ్యకరమైన ఎముకలు, సంతానోత్పత్తితో సహా హార్మోన్ల ఆరోగ్యం నుంచి మొత్తం ఆరోగ్యానికి ఇది అవసరం.




విటమిన్ -డి లోపం వల్ల కండరాల బలహీనత, ఎముకలు గుల్లబారడం జరుగుతుంది. విటమిన్-డి లోపం కాల్షియం లోపానికి దారి తీస్తుంది. ఫలితంగా పగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది. విటమిన్ డి ఉత్పత్తి చేయడానికి శరీరం సూర్యరశ్మిని ఉపయోగించుకుంటుంది. మహిళల ఎక్కువ సమయం ఇంటి లోపలే ఉంటారు. కొందరు ఆఫీస్‌లో ఏసీ గదుల్లోనే ఎక్కువ సమయం ఉంటారు. దీంతో విటమిన్ డి లోపం తలెత్తుతుంది. అందుకే ఎవరైనా కానీ ప్రతిరోజూ కనీసం 10 నుంచి 15 నిమిషాలు ఎండలో గడపాలని సిఫార్సు చేయబడింది. మీరు పనిచేసే కార్యాలయానికి సూర్యకాంతి అందుబాటులో ఉండేలా చూసుకోండి, కాడ్, సాల్మన్, ట్యూనా చేపలు తీసుకోండి. అల్పాహారం కోసం గుడ్లు తీసుకోండి. మీ ఆహారంలో చీజ్ మరియు పాలను చేర్చండి. మీరు శాఖాహారులు అయితే సప్లిమెంట్లను తీసుకోవడం మంచిది.

మూసుకున్న తలుపునే చూస్తూ , తెరచివున్న మరో తలుపును చూడకపోవడమే పెనువిషాదం

**కాల్షియం లోపం**

కాల్షియం శరీరంలో అధికంగా లభించే ఖనిజం. శరీరానికి ముఖ్య పోషకమైన కాల్షియం లోపిస్తే... అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఎముకలు, దంతాల్లో కాల్షియం ఎక్కువగా నిల్వ చేయబడుతుంది. కండరాల సంకోచం, రక్తం గడ్డకట్టడం, నరాల పనితీరును నిర్వహించడం, గుండె లయను నియంత్రించడంలో కాల్షియం ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. పాలిసిస్టిక్ అండాశయ సిండ్రోమ్‌లో రక్షణాత్మక పాత్ర పోషిస్తుంది. కాల్షియం లోపం వల్ల బోలు ఎముకల వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. నిస్సత్తువ, కండరాల నొప్పులు, గందరగోళం, జ్ఞాపకశక్తిని కోల్పోవడం, కండరాల తిమ్మిరి, చేతులు, పాదాలు, ముఖంలో జలదరింపు ఉంటుంది. ముఖ్యంగా ఎక్కువమంది పిల్లలు ఉన్న మహిళలు కాల్షియం బారినపడుతూ ఉంటారు.

45 ఏళ్లు పైబడిన మహిళలు తరుచుగా కాల్షియం లోపానికి గురవుతారు. ఎందుకంటే వారి పోస్ట్ మెనోపాజ్ కాలంలో వారి శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గుతాయి. ఆహార – పదార్థాల్లో ఉప్పును తగ్గించాలి. ఉప్పు ఎక్కువగా తీసుకుంటే మూత్రం ద్వారా కాల్షియం బయటకు పోతుంది. అందుకే ఉప్పును తక్కువగా తీసుకోవడం మంచిది. తోటకూర, బచ్చలి, పొన్నగంటి కూర, కొత్తిమీర లాంటి ఆకుకూరలు, పాలు, పాల ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవడం వల్ల కాల్షియం తగినంత శరీరానికి అంది. ఎముకులు దృఢంగా మారతాయి.

**విటమిన్–బి12 లోపం:**

ఎర్రరక్తకణాలు, డీఎన్ఏ ఏర్పడడం వంటి అనేక విధులకు మన మారతాయి. శరీరానికి అవసరమైన అత్యంత ముఖ్యమైన పోషకాలలో విటమిన్ బి 12 ఒకటి. మెదడు, నరాల కణాల అభివృద్ధిలో కూడా ఇది ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

ఈ విటమిన్ లోపంవల్ల అలసట, శ్వాస ఆడకపోవడం, తలనొప్పి, కళ్ళు తిరగడం, చర్మం పాలిపోవడం, గుండె దడ, జీర్ణ సమస్యలు, ఏకాగ్రత లేకపోవడం వంటివి మహిళలలో కనిపిస్తాయి. అధికంగా ప్రమాదం ఉండే మహిళలకు సప్లిమెంట్స్ సాయపడతాయి.. శాకాహారులు బి 12 సప్లిమెంట్స్ తీసుకోవడం మంచిది. ఈ విటమిన్ జంతు ఉత్పత్తులలో సహజ రూపంలో మాత్రమే కనిపిస్తుంది. గొడ్డు మాంసం, పంది మాంసం, గొర్రె మాంసం, చేపలు, పీత, సీఫుడ్, పాలు, చీజ్, పెరుగు గుడ్లలో ఎక్కువగా బి12 విటమిన్ ఉంటుంది.

**ప్రోటీన్ లోపం:**

ప్రోటీన్ అనేది కండరాల బిల్డింగ్ బ్లాక్స్ అని కూడా పిలువబడే ఒక ముఖ్యమైన మాక్రోన్యూట్రియెంట్. జుట్టు, చర్మం మరియు గోరు ప్రోటీన్‌తో తయారవుతాయి. ముఖ్యంగా శరీరంలో అత్యుత్తమ హార్మోన్ల సృష్టికి అధిక నాణ్యతతో కూడిన తగినంత ప్రోటీన్ అత్యవసరం. శరీరానికి గాలి, నీరు ఎంత ముఖ్యమో ప్రోటీన్ కూడా అంతే.

యుక్తవయసులోని మహిళలకు రోజుకు కనీసం 46 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుంది. ప్రతిరోజూ ఆహారంలో భాగంగా ఇది లభిస్తుంది. అయితే రోజూ 15 గ్రాముల కంటే తక్కువ ప్రోటీన్ అందుతూ ఉంటే మాత్రం సమస్య ఏర్పడుతుంది. దీనివల్ల పీరియడ్స్ గాడి తప్పుతాయి. సెక్స్ సామర్థ్యం తగ్గుతుంది. అలసట వంటి సమస్యలు ఏర్పడతాయి. బుగ్గలపై గోధుమ రంగు చర్మం ఏర్పడుతుంది. చిక్కుళ్ళు, గుడ్లు, కాటేజ్ చీజ్, పెరుగు, చికెన్, చేపలు, కాయలు, విత్తనాలు ప్రోటీన్ యొక్క ఆహార వనరులు.

**మెగ్నీషియం లోపం:**

శరీరంలోని అనేక విధులకు, కండరాలు సడలించడం నుంచి ప్రధాన శక్తి అణువు ఏటీపీ అభివృద్ధి వరకు మెగ్నీషియం అవసరం. అనేక ఎంజైమాటిక్ ప్రతిచర్యలలో పాల్గొంటుంది. సంకోచంతో పాటు కండరాలు సడలింపును సులభతరం చేస్తుంది. కండరాల తిమ్మిరిని తగ్గించడానికి సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. మహిళలు గర్భవతిగా ఉన్నప్పుడు శరీరం యొక్క కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడంలో సహాయపడుతుంది.

19 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న గర్భిణీ స్త్రీలు ప్రతిరోజూ 350 మిల్లీ గ్రాముల మెగ్నీషియం తీసుకోవడానికి ప్రయత్నించాలి. శరీరం, మెదడు ఆరోగ్యంలో అనేక ముఖ్యమైన పాత్రలను పోషిస్తుంది. యువతుల శరీరంలో 25 గ్రాముల మెగ్నీషియం ఉంటుంది. బాదం, బచ్చలికూర, జీడిపప్పు

మెగ్నీషియంలోని కొన్ని ముఖ్యమైన ఆహారాలు. అసాధారణ గుండె లయ, కండరాల తిమ్మిరి, వణుకు, విరామం లేని లెగ్ సిండ్రోమ్, అలసట, మైగ్రేన్, వ్యక్తిత్వ మార్పులు మెగ్నీషియం లోపం యొక్క సంకేతాలు. బీన్స్, కాయలు, నువ్వులు, గుమ్మడికాయ, పొద్దుతిరుగుడు విత్తనాలు వంటివి తీసుకోవాలి.

**అయోడిన్ లోపం:**

ఉప్పు ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బందే. నాణ్యమైన ఉప్పులో మాత్రమే అయోడిన్ ఉంటుంది. ఉప్పును మన శరీరం ఉత్పత్తి చేయలేదు. అందువల్ల ఉప్పును ఆహారం ద్వారా పరిమిత మొత్తంలో తీసుకోవాలి. బాల్యంలో, గర్భిణులకు, మధ్య వయస్సు వచ్చిన తరువాత, వృద్ధాప్యంలో... ఇలా వివిధ దశల్లో ఉప్పు, అయోడిన్, సోడియం మనకు అవసరమవుతాయి. శరీరంలో సోడియం తక్కువగా ఉందంటే, వారు ఉప్పును తీసుకోవాలని అర్థం. అయోడిన్ లోపాన్ని నివారించడానికి అయోడైజ్డ్ ఉప్పును తీసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. గర్భం దాల్చిన తరువాత పిండానికి అవసరమయ్యేంత అయోడిన్‌ను కూడా తల్లి ఆహారంలో తీసుకోవాలి. గర్భం వచ్చిన తరువాత తల్లికి థైరాయిడ్ హార్మోన్ల అవసరం పెరుగుతుంది. దీంతో అయోడిన్ ఎక్కువ అవసరమవుతుంది. ఈ పోషకం అవసరం అంతకుముందుకంటే... గర్భం తర్వాత పెరగడం వల్ల చాలా మంది మహిళలు తెలియకుండానే అయోడిన్ లోపం బారిన పడుతున్నారు. గర్భంలో ఉన్న శిశువు మెదడు అభివృద్ధికి అవసరమైన అయోడిన్ ప్రాముఖ్యతపై చాలామంది తల్లులకు అవగాహన తక్కువగా ఉంటుంది. యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం గర్భిణులు, పాలిచ్చే తల్లులందరికీ 250ఎంజి అయోడిన్ రోజువారీ అవసరమని చెప్పాయి.

ఆరు నుంచి 12 సంవత్సరాల వయసున్న పిల్లలకు రోజూ కనీసం 120 ఎంజి అయోడిన్ అవసరమవుతుంది. పిల్లలు పుట్టిన రెండు సంవత్సరాల వరకు వారి మెదడు అభివృద్ధి సక్రమంగా జరగాలంటే తగినంత అయోడిన్ అందివ్వాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని చిన్న పిల్లల్లో తగినంత అయోడిన్ అందేలా తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలి. ■

## కిలో నెయ్యి రూ.2 లక్షలు !

సాధారణంగా కిలో నెయ్యి రూ. 500 నుంచి వెయ్యి రూపాయల దాకా ఉంటుంది. కానీ గుజరాత్‌లోని ఈ నెయ్యి కొనాలంటే మాత్రం ఆస్తులు అమ్ముకోవాల్సిందే. దాని ధర కేజీ రూ.3500ల నుంచి రూ.2 లక్షల దాకా ఉంటుంది. వామ్మో అంత రేటు పెట్టి నెయ్యి ఎవరు కొనుక్కుంటారు అనే సందేహం రావచ్చు. అక్కడే ఉంది అసలు ట్విస్టు. గుజరాత్‌లోని గోండాల్‌లో రమేష్‌భాయ్ రూపరేలియా అనే రైతు గోశాలను నడుపుతున్నాడు. అక్కడ లభ్యమయ్యే ఆవుపాలతో నెయ్యిని చేసి... దాన్నుంచి రక



రకాల ఉత్పత్తులు తయారు చేస్తుంటాడు. ఈ నెయ్యిలో కుంకుమ పువ్వు, పసుపు, పిప్పళ్లు, గులాబీ రేకులు, మందారాలు... ఇలా రక రకాల మూలికల్ని కలుపుతాడు. అంతేకాదు, దాదాపు 31 లీటర్ల పాలకు వచ్చిన వెన్నను కాచి అందులో ఈ మూలికల్ని వేసి కేజీ నెయ్యి అయ్యేవరకూ బాగా మరిగిస్తాడు. చిక్కగా అయిన ఈ నెయ్యిని తినడానికి మాత్రం వాడరు. కేవలం చర్మానికే రాస్తారు. కాస్త రాసుకుంటే తలనొప్పి, చర్మవ్యాధులూ తగ్గుతాయట. వాసనచూడ్డంవల్ల దగ్గు అదుపులో ఉంటుందట. చర్మంపైన మొటిమల్నీ, నల్లమచ్చల్నీ అదుపు చేస్తుందట ఈ వనమూలికల నెయ్యి. ఆ ఔషధాల నెయ్యిని రమేశ్ – అమెరికా, కెనడా, సౌదీ అరేబియాతో పాటు దాదాపు వంద దేశాలకు పంపుతూ ఏడాదికి పదికోట్ల దాకా సంపాదిస్తున్నాడు. ■



# ప్రతి మహిళా తలెత్తుకు బతికే భవ్య భవిత కోసం ...

*“ఆడబిడ్డలందరికీ జీవించే హక్కు, విద్యా హక్కు, ఆరోగ్య హక్కు, రక్షణ, భద్రత పొందే హక్కు ఉండాలి. ఆ దిశగా సమాజంలో మార్పురావాలి” అంటారు కుముద్ సింగ్. ఆ మార్పు కోసం... ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలేసి... మురికివాడల బాట పట్టిన ఆమె వేలమంది అమ్మాయిల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. బతుకుబాట చూపించారు. హక్కుల కోసం ఎలా పోరాడాలో నేర్పించారు. 55 ఏళ్ళ కుముద్ 20 ఏళ్ళుగా సాగిస్తున్న సేవా ప్రస్థానం ఇది....*

“నేను పుట్టిందీ, పెరిగిందీ మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో. కానీ ఎప్పుడు సెలవులు వచ్చినా... ఉత్తరప్రదేశ్‌లోని మా స్వగ్రామం ప్రతాప్‌గఢ్‌కు మా కుటుంబమంతా వెళ్ళేది. నగర జీవితానికీ, పల్లె బతుకులకీ మధ్య ఉండే వ్యత్యాసాన్ని మొదటిసారిగా నేను గమనించింది అక్కడే. చీరని ముఖం చుట్టూ కప్పుకోకుండా మహిళలు బయటకి రావడం అక్కడ చాలా అరుదు. మహిళలకు... ముఖ్యంగా ఆడపిల్లలకు ఎన్నో ఆంక్షలు ఉండేవి. వాళ్ళని వారి కుటుంబంలోని పురుషులు కనీసం మాట్లాడనిచ్చేవారు కాదు. మరోవైపు... నేను ఎక్కడికి వెళ్తానన్నా మా ఇంట్లో అడ్డు చెప్పేవారు కాదు. ‘ఈ స్వేచ్ఛ అందరికీ ఉండాలి కదా?’ అనిపించేది. నాతోపాటే అది పెరుగుతూ వచ్చింది.



చదువు పూర్తయ్యాక... ఉద్యోగం, పెళ్ళి. జీవితం తొందరగా సాగిపోతోంది. కానీ ఎప్పుడు మా ఊరు వెళ్ళినా, మా ప్రాంతంలోని మురికివాడలను చూసినా బాధ కలిగేది. ఏళ్ళు గడిచిపోతున్నా అక్కడ ఆడవాళ్ళ బతుకుల్లో ఎలాంటి మార్పూ లేదు సరికదా... ఇంటా, బయటా మరిన్ని సమస్యలను వాళ్ళు ఎదుర్కోవాల్సి వస్తోంది.

‘నా వంతుగా ఏదీ చేయలేనా?’ అని ఆలోచించాను. ఒక రోజు నా భర్తతో చెప్పాను. “నువ్వు చెయ్యా లనుకున్నది చెయ్యి. ఇంటి విషయాలు, ఆర్థిక విషయాలు నేను చూసు కుంటాను” అంటూ నన్ను ఆయన ప్రోత్సహించారు. అలా 2003లో... ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేశాను. నాకు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరూ “మంచి ఉద్యోగం మానేసి... ఇదేం పిచ్చి పని? నీకేమైంది?” అని అడిగారు.

కానీ నా మనసుకు నచ్చిన పని చెయ్యాలనుకున్నాను. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించాను.

**ఆ సంఘటన విశ్వాసాన్ని కలిగించింది...**

రోజూ బస్తీల్లోకి వెళ్ళడం, పిల్లలను పిలవడం, వారికి చదువు నేర్పడం... మూడేళ్ళపాటు ఇదే నా దినచర్య.

కానీ ఆడపిల్లలకు, మహిళలకు వారి హక్కుల గురించి చైతన్య పరచడానికి ఇంకా చేయాల్సింది చాలా ఉందనిపించింది.

2006లో ‘సరోకార్’ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. బాలికలు, మహిళల సంక్షేమానికి కృషి చేసే సంఘాలతో కలిసి పని చేయడం మొదలుపెట్టాను. నా దగ్గర చదివే అమ్మాయిలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాను. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ఒక నాటకాన్ని తయారుచేశాం. దాన్ని వాడవాడలా ప్రదర్శించాం. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఆ బృందంలో పూనమ్ అనే అమ్మాయి ఉంది. ఆమెకు ఇంట్లోవాళ్ళు పెళ్ళి నిశ్చయించారు.

నాటకం ద్వారా నేర్చుకున్న విషయాలు ఆమెకు ఉపయోగపడ్డాయి. పెళ్ళిని ధైర్యంగా వ్యతిరేకించింది. తన చదువు కొనసాగించడానికి కుటుంబాన్ని ఒప్పించి, ఎంబీయే చేస్తోంది. ఆమె చూపించిన తెగువ... నేను సరైన మార్గంలోనే నడుస్తున్నాననే విశ్వాసాన్ని నాకు కలిగించింది.

ఆనందమంటే కష్టాలెరుగని సుఖంకాదు , కష్టాలను సుఖాలుగా మలచుకోగలిగిన చాకచక్యం

**అన్ని వర్గాలవారూ స్వచ్ఛందంగా...**

ఆ తరువాత 'సరోకార్' కార్యకలాపాలను క్రమంగా విస్తరించడానికి... వాలంటీర్లను ఆహ్వానించినప్పుడు మంచి స్పందన లభించింది. ఎంతోమంది ఉత్సాహంగా ముందుకు వచ్చారు. వారిలో గృహిణుల నుంచి వైద్యుల వరకూ... అన్ని వర్గాల మహిళలూ ఉన్నారు. వారు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా... ఖాళీ సమయాల్లో మాతో కలిసి పని చేస్తారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళి... విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించడం, పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడడం, జెండర్ సెన్సిటివిటీ తదితర అంశాల గురించి అమ్మాయిలకు వివరించడం, మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి అవగాహన కల్పించడం.... వీటన్నిటిలో మా వాలంటీర్లు చురుగ్గా పాలుపంచుకుంటున్నారు. మహిళలకు విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం... ఇవీ మేము ప్రధానంగా ఎంచుకున్న అంశాలు. ప్రత్యేకించి ఆరోగ్య సమస్యల విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాం.

ఇప్పటివరకూ భోపాల్‌లోని స్లమ్స్‌తోపాటు... చుట్టు పక్కల అనేక గ్రామాల్లో కొన్ని వేలమంది పిల్లలు మా సంస్థ ద్వారా ప్రయోజనం పొందారు. ఒకమ్మాయి వార్డుకౌన్సిలర్‌గా ఎన్నికైంది. దీనికి కారణం వీధి నాటకాల ద్వారా కలిగిన ఆత్మవిశ్వాసమేనని ఆమె చెప్పినప్పుడు నాకెంతో సంతోషం కలిగింది. మన సమాజంలో మహిళల పట్ల వివక్ష, హింస తరతరాలుగా సాగుతూనే ఉన్నాయి. వాటిని నిర్మూలించ డానికి సమయం పడుతుంది. అయితే ఆడపిల్లల్లో ఈ అంశాలపై చైతన్యం కలిగిస్తే... వారు తమ హక్కులను కాపాడుకుంటారు. రాబోయే తరాల్లోనైనా మార్పు వస్తుంది. మన సమాజం వివక్షారహితంగా మారాలి. ప్రతి మహిళా తలెత్తుకొని బతకాలి. పుట్టిన ప్రతి బిడ్డకూ భవిష్యత్తు ఉండాలి. ఇదే ఆశయం. దానికోసం కృషి చేస్తా."

భోపాల్‌లో అనేక గ్రామాల్లో కొన్ని వేలమంది పిల్లలు మా సంస్థ ద్వారా ప్రయోజనం పొందారు. వారిలో చాలామంది ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. కొందరు సొంత కంపెనీలు నడుపుతున్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

## భోపాల్‌లో ఎఫ్ పి ఓ లతో ఎస్ బి ఐ అనుసంధాన సదస్సు

**ఎఫ్** పి ఓల రుణ అవసరాలను తీర్చడం లక్ష్యంగా వాటికి స్టేట్ బ్యాంక్‌తో అనుసంధానం కల్పించడానికి ఏపిమాస్ తీవ్రంగా కృషి చేస్తున్నది. ఇందుకోసం రాష్ట్ర స్థాయి అనుసంధాన సదస్సులను నిర్వహిస్తున్నది. ఇప్పటికే నాలుగు సదస్సులను నిర్వహించిన ఏపిమాస్ , ఐదవ సదస్సును మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో అక్టోబర్ 5 వ తేదీన నిర్వహించింది. మధ్యప్రదేశ్ తోపాటు చత్తీస్‌ఘర్ రాష్ట్రం నుంచికూడా అర్హులైన, రుణ అవసరం వున్న ఎఫ్ పి ఓలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. చత్తీస్‌ఘర్ నుంచి 23 , మధ్యప్రదేశ్ నుంచి 54 , మొత్తం 77 ఎఫ్ పి ఓలు ఈ సదస్సులో పాల్గొనడానికి పేర్లను నమోదుచేసుకున్నాయి. కాని 5 వ తేదీనాటి సదస్సుకు 44 ఎఫ్ పి ఓల ప్రతినిధులు మాత్రమే హాజరైనారు. రుణం మంజూరుకు వీటి అర్హతలను మదింపుచేయగా, 8 ఎఫ్ పి ఓలు సంస్థాగత నిర్వహణలో యింకా మెరుగైన పనితీరు కనబరచవలసి వున్నదని తేలింది. మదింపు ప్రక్రియలో ఒక ఎఫ్ పి ఓ పాల్గొనలేదు. రెండు ఎఫ్ పి ఓలు యిప్పటికే ఎస్ బి ఐతో అనుసంధానమై ప్రయోజనాలు పొందుతున్నాయి. మిగిలిన 33 ఎఫ్ పి ఓ లకు మొత్తం 14 . 14 కోట్ల మేరకు రుణాలు పొందడానికి లాంఛనంగా అనుమతి పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ బి ఐ ప్రధాన కార్యాలయం డి జి ఎం శ్రీ జుల్ఫికర్ అలీఖాన్, ముంబై ఎస్ బి ఐ ప్రధాన కార్యాలయ డి జి ఎం శ్రీ యోగేంద్ర షెల్కే , భోపాల్ ఎస్ బి ఐ ప్రధాన కార్యాలయం ఏ జి ఎం శ్రీ సందీప్, ఏపిమాస్ సి ఇ ఓ ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి పాల్గొన్నారు. అక్టోబర్ 27 వ తేదీన కర్ణాటక రాజధాని బెంగుళూరులో ఆరవ సదస్సును ఏపిమాస్ నిర్వహించింది.




ఇతరుల ఆశయాలను అవహేళన చేయకూడదు, ఏమో నవ్విన నాపచేనే పండవచ్చు గదా!

# తెగులుతో నిలువునా ఎండుతున్న వేపచెట్లు!

వాతావరణంలో, వర్షపాతంలో చోటు చేసుకుంటున్న పెను మార్పులే వేప చెట్లకు శాపంగా మారినా, దీనివల్ల వేప కాయల ఉత్పత్తికి విఘాతం కలగటం లేదని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ప్రాథమిక అధ్యయనంలో నిర్ధారణకు వచ్చింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో పాటు కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ప్రతి ఏటా వేపచెట్ల చిగుర్లు మాడి పోతుండటం, మరికొన్ని చోట్ల చెట్లు నిలువునా ఎండి పోతుండటం గత కొన్నేళ్లుగా రివాజుగా మారిన విషయం తెలిసిందే.



టీ మస్కిటో పురుగు (టిఎంబి) సోకటం వల్ల కొన్ని నెలల పాటు (మే–సెప్టెంబర్) వేప చెట్ల కొమ్మలు ఎండి పోతూ.... తిరిగి వాటికవే తిప్పుకుంటున్నాయి. ఇది నైరుతి రుతుపవనాల కాలం ముగిసిన తర్వాత తగ్గిపోయే సమస్యేనని, దీనివల్ల వేప కాయల దిగుబడికి పెద్దగా నష్టం లేదని ఉత్తరప్రదేశ్ ఝాన్సీలోని ఐసీఏఆర్ – కేంద్రీయ ఆగ్రోఫారెస్ట్రీ పరిశోధనా సంస్థ (సిఎఎఫ్ఆర్ – కాఫ్రి) సంచాలకులు డా. ఎ. అరుణాచలం వెల్లడించారు. అయితే, క్రిమిసంహారక స్వభావం కలిగిన వేపను టిఎంబి గతమెన్నడూ లేనంతగా ఇంత పెద్దఎత్తున ఎందుకు ఆశిస్తోందన్న అంశంపై లోతైన అధ్యయనం జరగాల్సి ఉందన్నారు.

**గాలిలో అధిక తేమ వల్లనే పురుగు ఉధృతి**

ఆగ్రోఫారెస్ట్రీపై జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు ఇటీవల హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ఆయన 'సాక్షి సాగుబడి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మే నుంచి అకాల వర్షాలు, వర్షపాతంలో అసాధారణ మార్పుల వల్ల ఆయా రాష్ట్రాల్లో గాలిలో తేమ అధికంగా ఉండటం మూలంగా టీ మస్కిటో పురుగు ఉధృతి పెరుగుతోందన్నారు.

**తెలంగాణలో కూడా కనిపించడం విచిత్రమే.**

సముద్ర తీర రాష్ట్రాల్లో ఇది ప్రధాన సమస్యగా ఎదురవుతున్నదని, కానీ తెలంగాణలో కూడా ఇది తీవ్రంగా కనిపిస్తుండటం పట్ల ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారాయన.

95 దేశాల్లో వేప చెట్లు పెరుగుతున్నాయని, అయితే, టీ మస్కిటో పురుగు సోకుతున్నట్లు చైనా తప్ప మరే దేశమూ వెల్లడించలేదన్నారు.

గాలి ద్వారానే టిఎంబి విస్తరిస్తోందని, ఒక ప్రదేశంలో దగ్గర దగ్గరగా ఉన్న చెట్లకు ఎక్కువగా సోకుతోందని, ఇది మనుషులకు హానికరం కాదని డా. అరుణాచలం అన్నారు.

**ఇలా అరికట్టవచ్చు**

పొటాషియం లోపించిన నేలల్లో పెరుగుతున్న వేప చెట్లకు టీఎంబీ ఎక్కువగా సోకుతున్నట్లు కొన్ని ప్రాంతాల్లో గుర్తించారు. పొటాషియం పుష్కలంగా ఉన్న నేలల్లో చెట్లకు పెద్దగా సోకలేదు. పశువుల ఎరువులో ట్రైకోడెర్మా విరిడి కలిపి వేపచెట్లకు వేస్తే కొమ్మెందు సమస్యను సమర్థవంతంగా అరికట్టవచ్చని డా. అరుణాచలం వివరించారు.

– సాక్షి సౌజన్యంతో

# 80 వ్యాధులకు అరటిపండు చికిత్స !

**ఆ**రోగ్యానికి బలాన్నిచ్చే చాలా రకాల పండ్లలో తేలికగా అరుగుదలకు వచ్చే పండు అరటి పండు. పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చే పండు, ఆరోగ్యానికి సంబంధించినంత వరకూ అరటి పండు చాలా శక్తిని అందిస్తుంది. అరటి చాలా ప్రయోజన కరమైన, శక్తివంతమైన పండు. దీన్ని తినడం వల్ల శరీరానికి జీవం వస్తుంది. కానీ ఈ ఆహారం అందరికీ మంచిది కాదు. ఆయుర్వేదంలో, అరటి పండు కొంతమందికి ప్రమాదకరమైనదిగా చెప్పబడింది. అరటిపండు ఎవరు తినాలి .... ఎవరు తినడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసుకుందాం.



అరటిపండు తినడం వల్ల ఏం లభిస్తుంది? అరటి పండులో విటమిన్ సి, ఫైబర్, పొటాషియం, మాంగనీస్, విటమిన్ బి6తో పాటు గ్లూటాతియోన్, ఫినాలిక్స్, డెల్ఫిడినిన్, రుటిన్, నారింగిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి.

**అరటిపండు ఎవరు తినాలి, ఎవరు తినకూడదు?**

పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటి వాత, పిత్త దోషాన్ని సమతుల్యం చేస్తుంది. వాతం క్షీణించడం వల్ల దాదాపు 80 రకాల వ్యాధులు వస్తాయని ఆయుర్వేదంలో చెప్పబడింది. ఇది పొడిబారడం, ముడతలు పడటం, ఎముకలలో అంతరం, మలబద్ధకం, చేదు రుచి మొదలైన అనేక సమస్యలను కలిగి ఉంటుంది.

**కోపం ఎక్కువగా వుందా ? అరటిపండు తినండి ..**

ఆయుర్వేదం ప్రకారం, అరటిపండు ప్రకృతిలో చల్లగా ఉంటుంది. జీర్ణం చేయడానికి బరువుగా ఉంటుంది. ఇది లూబ్రికేషన్‌గా పని చేస్తుంది. శరీరం ఎండిపోయి, ఎప్పుడూ అలసిపోయి, బాగా నిద్రపోని, శరీరంలో ఎప్పుడూ మంటగా ఉన్న, చాలా దాహంగా ఉన్న, చాలా కోపంగా ఉన్నవారు ఈ ఆహారాన్ని తినాలి.

**అరటిపండు ఎవరు తినకూడదు?**

ఇది కఫ దోషాన్ని పెంచుతుంది, కాబట్టి అధిక కఫం ఉన్నవారు అరటి పండు తినకూడదు. పెరిగిన కఫం కారణంగా జీర్ణ అగ్ని బలహీనంగా ఉంటే, ఈ పండు తినడం వల్ల మరింత నెమ్మదిస్తుంది. అధిక కొవ్వు, దగ్గు, జలుబు ఉన్నవారు, ఆస్తమా రోగులు దీనిని తినకూడదు. ■

## చిరుధాన్యాలపై ఇక 5 శాతం జి ఎస్ టి !

**ప**లు ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గిస్తూ వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) మండలి నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చిరుధాన్యాల (మిల్లెట్స్) పిండిపై జీఎస్టీటీ తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ప్రీ ప్యాకేజ్డ్ మరియు లేబుల్డ్ మిల్లెట్స్‌పై ఇకపై జిఎస్‌టి 5 శాతంగా ఉంటుందని తెలిపారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అంతకుముందు ఈ జిఎస్‌టి 18 శాతంగా ఉండేది. కనీసం 70 శాతం మిల్లెట్స్‌తో కూడిన పిండిని లూజుగా విక్రయిస్తే ఎలాంటి జిఎస్‌టి వర్తించదని అన్నారు. మిల్లెట్లను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే మండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో జరిగిన 52వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం నిర్మలమ్మ, కౌన్సిల్ నిర్ణయాలను వెల్లడించారు.

ఇదే సమావేశంలో మొలాసిస్‌పై జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది మండలి. ప్రస్తుతం మొలాసిస్‌పై జీఎస్టి 28 శాతంగా ఉండగా.. దీనిని ఇప్పుడు 5 శాతానికి తగ్గించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో చెరుకు రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు నిర్మలా సీతా రామన్. ఇంకా మానవ అవసరాల కోసం వినియోగించే డిస్టిల్ ఆల్కహాల్లు జిఎస్‌టి నుంచి మినహాయింపు కల్పిస్తున్నట్లు చెప్పింది జీఎస్టి మండలి. ■

# భూతాపాన్ని జయించిన భూమిపుత్రులు !

**భూతాపం పెరుగుతోంది. విపరీతమైన ఎండలు రైతుల పొలాలను బీడు భూములుగా మారుస్తున్నాయి. నేల మీద నీటిచుక్క పడగానే ఆవిరైపోతోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో... వాతావరణ మార్పులను అవగాహన చేసుకుని, వాటికి అనుగుణంగా సరికొత్త సాగు పద్ధతులతో, సృజనాత్మక విధానాలతో రూపుదిద్దుకున్నదే 'క్లైమెట్ ప్రూఫింగ్ ప్రాజెక్టు'. నాబార్డ్ ఆధ్వర్యంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఒక యజ్ఞంలా కొన్ని గ్రామాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ చక్కని ఫలితాలను ఇస్తూ భూమిపుత్రుల ముఖాలపై సంతోషాల్ని పూయిస్తోంది.**

నెలకు రూ. 15 వేల జీతానికి హైదరాబాద్లో కొలువు చేస్తున్న భర్త రమేష్‌ను వెనక్కి రప్పించింది మమత. తమ సొంత పొలంలోకి నడిపించి కూరగాయలు, బంతిపూల సాగు చేయించింది. ఉన్న ఊరిలోనే ఇప్పుడు నెలకు దాదాపు రూ. 40 వేలకు పైగా ఆర్జిస్తూ 'మా దారి.. పూల దారి' అని నిరూపించారు తెలంగాణలోని అనంతారం (యాదాద్రి భువనగిరి జిల్లా)కు చెందిన ఈ జంట:

రెండు దశాబ్దాల క్రితం తూరుపు కనుమలలోని నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేటలో అన్నీ బీడు నేలలే, అతి తక్కువ. వర్షపాతం సాగుబడి లేక రైతులు వలసలు వెళ్ళేవారు. 'ఉన్న ఊరు, కన్న బిడ్డలను వదిలేసి ఎంతకాలమిలా వేరే ప్రాంతాలకు పోతాం' అని స్థానికులు గ్రామసభలో చర్చించారు. మహిళలు కొంగు బిగించి పొలాల్లోకి దిగారు. ఎడారి నేలను సస్యశ్యామలంగా మార్చారు. ఏడాదికి మూడు పంటలు వేస్తున్నారు.

శ్రీసత్యసాయి (అనంతపురం) జిల్లా, నంబూల పూలకుంట మండలం ధనియాని చెరువులో ఒకప్పుడు తీవ్ర కరువు. ప్రతి ఇంటి ముందూ ఖాళీ డ్రమ్ములు పెట్టుకుని, వాటర్ ట్యాంకుల కోసం ఎదురుచూసేవారు. తేమ లేక పొలాల నిండా నెర్రెలు. ఇప్పుడలా కాదు...బోర్లు, కుంటలు నిండాయి. ఒకప్పుడు ఎనిమిది మీటర్ల లోతున ఉన్న నీళ్ళు... నేడు నాలుగు మీటర్లలోనే దొరుకుతున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు తగినట్టు వ్యవసాయ విధానాల్లో మార్పులు తెచ్చి పండ్లు, కూరగాయలు, వరి పండిస్తున్నారు.



దశాబ్దంన్నర క్రితం... అవన్నీ సారం. కోల్పోయిన నేలలు. అతి తక్కువ వర్షపాతం... సాగుబడి లేక రైతులు వలస పక్షులే అయ్యారు. అలాంటి చోట పాతాళగంగను పైకి లాక్కొచ్చి, మన్నులో నుంచి అన్నం తీస్తున్నారు. వీళ్లే కాదు.. అకాల వర్షాలు, వరదలు, అధిక ఉష్ణోగ్రతల వల్ల సాగుబడి సాగక కాడిని వదిలేసిన ఎందరో రైతులు ఇప్పుడు వ్యవసాయాన్ని పండగలా చేసుకోవడం వెనుక ఒక అరుదైన సంకల్పం ఉంది. అదే.. 'క్లైమెట్ ప్రూపింగ్ ప్రాజెక్టు'.

**ఏమిటీ ప్రాజెక్ట్ ?**

రాబోయే కొన్ని నెలల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల కరువు పరిస్థితులతో పాటు తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతాయని... దీనివల్ల పంటలు, తాగునీటికి ఇబ్బందులు తప్పవని ప్రపంచ వాతావరణ సంస్థ' హెచ్చరిస్తోంది. అనూహ్య వాతావరణ మార్పులు మానవాళిని కలవరపెడుతున్నాయి. ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వీటి ప్రభావం ప్రధానంగా వ్యవసాయ ఉత్పాదకతపై పడి ఆహార కొరత ఏర్పడుతుందని,

**కొత్తదారి తొక్కే సాహసం చేయలేకపోతే పాతదారితోనే రాజీపడక తప్పదు**

భవిష్యత్లో ప్రజలు ఆకలితో అలమటించాల్సి వస్తుందని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.



వర్షాధార ప్రాంతాలలో వాతావరణ మార్పుల తీవ్రత వల్ల సాగుబడి సంక్షోభంలో పడటాన్ని ముందుగానే అంచనా వేసి భూతాపాన్ని ఎదుర్కొని... భూసారాన్ని కాపాడి, పంటల దిగుబడులు పెంచే క్లైమెట్ ప్రూపింగ్ ప్రాజెక్టని జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) దేశవ్యాప్తంగా కొన్ని కరువు ప్రాంతాలతో పాటు, ఆంధ్ర, తెలంగాణలో కూడా రైతులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అమలు చేసింది.

**రైతుల కోసం..**

- భూసారం, వాన నీటి సంరక్షణకు ఫారంపాండ్లు, గ్యాబియన్ కట్టడాలు నిర్మించారు. పొలాల్లో లోదుక్కుల ద్వారా నేల సారం పెంచారు.
- వ్యసాయంలో ఆధునిక టెక్నాలజీని పరిచయం చేసి, భూమిలో తేమను, నీటి అవసరాన్ని నియంత్రించే పరికరాలను ఏర్పాటు చేశారు. వాటిని సెల్ఫోన్ ద్వారా నియంత్రిస్తారు. ఈ విషయంలో రైతులకు అవగాహన కలిగించారు.
- పశుపోషణ కోసం పశుగ్రాసం, భూసారం పెంచే పచ్చ రొట్ట ఎరువు కోసం జీలుగ పంటలను ప్రోత్సహించారు. ఒకే పంట కాకుండా బహుళ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కలిగించారు.
- రైతులు పందిర్లు వేసుకోవడానికి సహకరించారు. దీనివల్ల కాకర, బీర, దొండ, సొరకాయ వంటి తీగజాతి కూరగాయల దిగుబడి పెరిగింది. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు వచ్చే చిరుధాన్యాల సాగుతో పాటు పూలు, కూరగాయలను ప్రోత్సహించారు.
- భూమి లేని నిరుపేదల జీవనోపాధి కోసం మేకలు, నాటుకోళ్ల పెంపకానికి సాయం చేశారు. పోషకాహారం కోసం పెరటి మొక్కలను అందజేశారు.
- వాన నీటి సంరక్షణ పనుల వల్ల గతంలో 300 అడుగుల లోతులో ఉన్న భూగర్భ జలమట్టం నేడు 100 నుంచి 150 అడుగులు పైకి వచ్చింది.
- సహజవనరులను కాపాడి, భూసారం పెంచడంతో సమృద్ధిగా పంటలు పండిస్తున్నారు. పంటల దిగుబడి గతంలో కంటే 30 నుంచి 40 శాతం పెరిగింది. పెట్టుబడి తగ్గింది.
- ఈ ప్రాజెక్ట్ వల్ల రైతుల జీవనోపాధి మెరుగుపరచడమే కాకుండా వ్యక్తిగత, ఆదాయ భద్రత చేకూరింది. వలస వెళ్లిన రైతులు తిరిగొచ్చి మరలా వ్యవసాయం చేసుకుంటున్నారు.

**ప్రతీ నీటి బొట్టును ఒడిసిపట్టి...**

అకాల వర్షాలు, తీవ్రమైన వేడి వల్ల కలిగే మార్పులను తట్టుకునే సామర్థ్యం మొక్కల్లో పెంచడానికి, భూసారాన్ని పెంచి ప్రత్యామ్నాయ పంటల సాగు, జలసంరక్షణపై రైతులకు అవగాహన కల్పించి, వారిలో నమ్మకాన్ని పెంచారు.

నేల, తేమ, వృక్ష సంపద వంటి సహజ వనరులను రక్షించి, వ్యవసాయ పద్ధతుల్లో మార్పు తీసుకువచ్చి ఉత్పాదకత పెంచారు.

కేవలం అధిక నీటితో సాగుచేసే వరి పంటపైనే ఆధార పడకుండా, తక్కువ నీటితో పండే చిరుదాన్యాలు, పండ్లు, కూరగాయలను ప్రోత్సహించారు. కురిసిన ప్రతీ చినుకును నేలలో ఇంకించి, మొక్కల పేర్లకు మాత్రమే చేరేలా వినూత్న మైన పద్ధతులను పరిచయం చేశారు. సంప్రదాయ సాగు

విధానాన్ని సమూలంగా మార్చివేశారు. వాటిలో కొన్ని ఇవి...

**భూగర్భ జలడ్యామ్**

సాగునీటి ప్రాజెక్టులు నదుల మీద కట్టడం అందరికీ తెలిసిందే. వాతావరణ అనుసరణ ప్రాజెక్ట్‌లో భాగంగా 'షార్ప్' స్వచ్ఛంద సంస్థ జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, ధన్వాడలోని చెలిమెల వాగు కింద ఇసుకలో ఆనకట్టలు కట్టింది. దీనివల్ల వర్షాలు పడినపుడు నీరు అక్కడే భూమిలోకి. ఇంకిపోతుంది. ఏడాదంతా నేల తేమగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ వల్ల చుట్టుపక్కల 70 ఎకరాల వరకు సాగులోకి వచ్చింది. స్వల్ప ఖర్చుతోనే రైతులు శ్రమదానంతో శాశ్వత సాగునీటి భద్రత సాధించారు.

**రాక్ ఫిల్ డ్యామ్స్, చెక్ వాల్స్**

వానలు, వరదల వల్ల వాలు ప్రాంతంలో భూమి కోతకు గురై భూసారం అంతా కొట్టుకుపోతుంది. దీనిని అడ్డుకోవ డానికి, వాలుకు అడ్డంగా రాతికట్టలు, కాలువలపై చెక్కమ్లు నిర్మించి ప్రవహించే నీటికి నడకలు నేర్పారు. దీనివల్ల వాననీటిని సంరక్షించడంతో పాటు, భూసారం కాపాడారు.

పొలంలో తేమను గుర్తించే యంత్రం కూరగాయల పొలంలో 'సాయిల్ మాయిశ్చర్ సెన్సర్ని పెట్టుకోవచ్చు. ఈ పరికరం పంప్ కంట్రోలర్ కూడా పని చేస్తుంది. దీనివల్ల మొక్కలకు ఎంతవరకు నీరు, తేమ అవసరమో సెల్ఫోన్కు సందేశం వస్తుంది. దానిని అనుసరించి రైతులు.. సాగునీటిని వినియోగిస్తారు. 'దీనివల్ల నీరు ఆదా అవడంతో పాటు దిగుబడి పెరుగుతుందని ధన్వాడ రైతు తాడి పుష్పలత అంటున్నారు.

**బోర్‌వెల్ రీఛార్జ్ పాయింట్**

ఎండిన బోర్లకు జీవం పోయడమే బోర్వెల్ రీఛార్జ్, బోరుకు పక్కనే ఒక ఇంకుడు గుంతను తవ్వి, వర్షపు నీటిని దానిలోకి మళ్లిస్తారు. దీని వల్ల భూగర్భ జలాలు పెరిగి జోర్ లోకి నీరు చేరి వేసవిలో నీటికి ఇబ్బంది ఉండదు.

**ఐదంచెల సాగు**

వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడంలో ఐదంచెల వ్యవసాయ విధానం ఒకటి. దీనిని అనుసరిస్తూ ఏడాది పొడవునా నిత్యం ఆదాయం వచ్చేలా పంటలు పండిస్తు న్నారు. భూమి లోపల పండే పంటలు, భూమిపైన పండే పంటలు, పందిర్ల పై పండే తీగజాతి పంటలు చెట్లను పాకుతూ పండే పంటలతో పాటు పొలం గట్ల మీద శ్రీగంధం, ఎర్రచందనం, సీతాఫలం, అడవి మొక్కలను పెంచుతున్నారు. ఏడాదిలో వచ్చేవి, రెండేళ్లలో వచ్చే వివిధ రకాల ఉద్యాన పంటలను పండిస్తున్నారు. ఈ పద్ధతిలో ఏడాది పొడవునా పంట వచ్చేలా భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. పంటలకు ఘన, ద్రవ జీవామృతాలను అందిస్తున్నారు.

- **చుక్కల, తుంపర సేద్యం**

అంతంత మాత్రమే ఉన్న భూగర్భ జలాలు వృథా కాకుండా మొక్కలకు సరిపడా మాత్రమే అందించడానికి రెయిన్ గన్లు, స్ప్రింక్లర్ డ్రిప్ ఇరిగేషన్ కోసం రైతులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. దీనివల్ల కలుపు తగ్గడమే కాక నీరు, విద్యుత్, సమయం ఆదా అవుతుంది.

- **వాతావరణ కేంద్రం**

వాతావరణ మార్పులకు తగిన సాగు ప్రాజెక్టులో భాగంగా అనంతపురం జిల్లా చీలేపల్లి రైతులకు వాతావరణ సమాచారం తెలుసుకోవడానికి అనువైన వాతావరణ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతి గంటకు వాతావరణంలో జరిగే మార్పులను వెబ్ సైట్ ద్వారా తెలియజేస్తారు. దీని ద్వారా వర్షపాతాన్ని, గాలి వేగాన్ని, గాలి దిశను, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకోవచ్చు. ఈ సమాచారం ఎప్పటికప్పుడు బోర్డులపై రాసి గ్రామస్తులకు అందుబాటులో ఉంచుతారు. దీని వల్ల రైతులు పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకుని, నష్టాలను నివారించవచ్చు.

ఏదేమైనా రైతులు సంఘటితంగా శ్రమించి, వాతావరణ మార్పులు తట్టుకునేలా సాగు చేస్తే, కరువుని జయించవచ్చనే భరోసాను ఈ ప్రాజెక్ట్ ఇచ్చింది. భూతాపంతో కుదేలై బంజరుగా మారిన నేలలు, నేడు పచ్చని పైరులతో కళకళ లాడటం వెనుక రైతుల పట్టుదలతో పాటు ఎన్జీవోల చిత్తశు ద్ధి, నాబార్డ్, ప్రభుత్వ సంస్థల సమన్వయం ఉంది. అందుకు ఈ రైతు విజయమే ఒక ఉదాహరణ...

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

**కండల వల్ల బలం రాదు, ఆ కండలను కదిలించే మానసిక సంకల్పానిదే ఆ బలం**

# ఈ ఐదు లక్షణాలు గుండె సమస్యలకు సూచికలు !

**గుం**డె శరీర అవసరాలను తీర్చడానికి తగినంత రక్తాన్ని పంప్ చేయలేనప్పుడు గుండె వైఫల్యం సంభవిస్తుంది, కొన్ని జీవనశైలి మార్పులు, బరువు తగ్గడం, వ్యాయామం లేకపోవడం వంటివి గుండె వైఫల్యానికి కారణం అవుతాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, శ్వాస ఆడకపోవడం, అలసట, అవయవాలలో వాపు వంటి గుండె వైఫల్యానికి సాధారణ సంకేతాలు, అందువల్ల, ఈ సమస్యను అధిగమించ డానికి సరైన చికిత్స గుండె వైఫల్యం లక్షణాలను ముందుగానే తెలుసుకోవడం ముఖ్యం.

**ఈ వైవిధ్య లక్షణాలలో కొన్ని...**

ఆగకుండా దగ్గు రావడం అనేది రక్తప్రసరణ గుండె వైఫల్యానికి ముఖ్యమైన లక్షణం, నిపుణులు దీనిని చాలాసార్లు



గుండె సమస్యగా సూచిస్తారు, ఇది నాన్స్టాప్ వస్తూనే ఉంటుంది. తెలుపు లేదా గులాబీ రంగులో ఉండే శ్లేష్మం కనిపిస్తుంది. గుండె వైఫల్యం ఉన్న రోగులకు కూడా శ్వాసలో గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

**ఆకలి లేకపోవడం**

ఆకలి లేకపోవడం, అనేది గుండె వైఫల్యానికి అస్పష్టమైన సంకేతం. వైద్యుల అభిప్రాయం ప్రకారం, వికారంగా ఉండటం కూడా గుండె అనారోగ్యంతో ఉన్నవారు కేలరీలు, పోషకాలతో నిండిన పదార్థాలు తినడం కష్టతరం అవుతుంది. ఇది కండరాల వృధా, బరువు తగ్గడానికి కారణమవుతుంది. గుండె వైఫల్యంతో బాధ పడుతుంటే, జీర్ణవ్యవస్థకు రక్త ప్రసరణ తగ్గుతుంది, దీని ఫలితంగా జీర్ణక్రియ ప్రక్రియలో అంతరాయం ఏర్పడు తుంది. రక్తాన్ని పంప్ చేయడానికి గుండె చాలా కష్టపడాల్సి రావడం వల్ల ఇలా జరుగుతుందని, గుండెలోని గదులు సరిగ్గా నిండకపోవడమే కాకుండా ఖాళీ అవడం వల్ల రక్త ప్రసరణ పరిమాణం తగ్గిపోతుందని వైద్యులు చెబుతున్నారు.

**బరువు**

చాలామంది వ్యక్తులు గుండె సమస్యలు, బరువు పెరుగుట మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోలేరు కాబట్టి ఇది గుండె వైఫల్యానికి అత్యంత అసాధారణమైన సంకేతం. అయితే, నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2 నుంచి 3 రోజులలో ఒకటి నుండి రెండు కిలోగ్రాముల కంటే ఎక్కువ బరువు పెరగడం వల్ల గుండె సరిగ్గా పని చేయకపోవడం వల్ల ద్రవాలను నిలుపుకోవడం వల్ల సంభవించవచ్చు.

**రాత్రి పూట మూత్రవిసర్జన**

రాత్రిపూట మూత్రవిసర్జన పెరగడం మధుమేహం, అనేక ఇతర ఆరోగ్య పరిస్థితుల కారణంగా వస్తుంది. అయినప్పటికీ, నోక్టురియా కూడా గుండె జబ్బులకు కారణం కావచ్చని వైద్యులు చెబుతున్నారు.

పడుకోవడం వల్ల కిడ్నీ పనితీరు మెరుగుపడుతుంది, శరీరం పగటిపూట పేరుకుపోయిన ద్రవాలను బయటకు తీయడం సులభం చేస్తుంది. పడుకున్నప్పుడు, మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది, మూత్రం ఉత్పత్తి పెరుగుతుంది.

**మానసిక సమస్యలు..**

మెదడుకు రక్త ప్రసరణ తగ్గడం వల్ల గుండె వైఫల్యం మెదడు పనితీరును దెబ్బతీస్తుంది. చాలామంది జ్ఞాపకశక్తి సమస్యలు, ఏకాగ్రతలో ఇబ్బంది, మానసిక సమస్యలు అనుభవిస్తున్నారని వైద్యుల అభిప్రాయం ■

**తపన వుంటే గెలుపు తథ్యం, అదొక్కటీ లేకుంటే ఓటమి ఖాయం**

# సుకన్య సమృద్ధి యోజన : 21 ఏళ్ళకే రూ.51 లక్షలు!

**కూ**తుళ్ల భవిష్యత్తు కోసం డబ్బును ఆదా చేయాలనుకునే తల్లిదండ్రులకు సుకన్య సమృద్ధి యోజన (ఎస్ ఎస్ వై) బెస్ట్ స్కీమ్‌గా నిలుస్తోంది. ప్రభుత్వ మద్దతు ఉన్న ఈ పథకం పూర్తిగా సురక్షితమైనది. ఎస్ ఎస్ వై కింద, తల్లిదండ్రులు తమ కుమార్తెకు 14 సంవత్సరాల వయసు వచ్చే వరకు పథకంలో పెట్టుబడి పెట్టవచ్చు. కుమార్తెకు 18 ఏళ్లు నిండిన తర్వాత, వారు మెచ్యూరిటీ అమౌంట్‌లో 50% విత్‌డ్రా చేసుకోవచ్చు. మిగిలిన 50% కుమార్తెకు పూర్తి మెచ్యూరిటీ వయసు 21 ఏళ్లు వచ్చినప్పుడు విత్‌డ్రా చేసుకోవచ్చు. భారత ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన (ఎస్ ఎస్ వై) పథకంలో పెట్టిన పెట్టుబడిపై 8 శాతం వార్షిక వడ్డీ రేటు అందిస్తుంది. ఈ వడ్డీని ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి లెక్కించి చెల్లిస్తుంది. అంటే వడ్డీ త్రైమాసిక ప్రాతిపదికన జమ అవుతుంది. ఇటీవలే ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికంలో ప్రభుత్వం ఎస్ ఎస్ వై వడ్డీ రేటును ఏడాదికి 7.60% నుంచి 8%కి పెంచింది.

**పెట్టుబడి వ్యవధి**

తల్లిదండ్రులు తమకు ఆడపిల్ల పుట్టిన వెంటనే సుకన్య సమృద్ధి యోజన (ఎస్ ఎస్ వై) అకౌంట్‌లో పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే, వారు గరిష్ఠంగా 15 ఏళ్ల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఎందుకంటే ఆడపిల్లకు 14 ఏళ్లు వచ్చే వరకు ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు.

**పెట్టుబడి పరిమితి**

(ఎస్ ఎస్ వై) పథకం ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సి కింద పన్ను ప్రయోజనాలను అందిస్తుంది. ఒక పెట్టుబడిదారు నెలకు రూ.10,000 వంతున 12 ఇఎంఐ లలో ఏడాదికి రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టవచ్చు.

**మెచ్యూరిటీ అమౌంట్**

(ఎస్ ఎస్ వై) క్యాలిక్యులేటర్ ప్రకారం, ఆడపిల్లకు 18 ఏళ్లు నిండినప్పుడు పెట్టుబడిదారు మెచ్యూరిటీ మొత్తంలో 50% విత్‌డ్రా చేయకపోతే, వారు రూ.51,03,707 లేదా దాదాపు రూ.51 లక్షల మెచ్యూరిటీ మొత్తాన్ని అందుకుంటారు. ఇందులో మొత్తం పెట్టుబడి రూ.18 లక్షలు కాగా మిగిలిన రూ.33,03,707 లేదా దాదాపు రూ.33 లక్షలు 21 ఏళ్ల మెచ్యూరిటీ వ్యవధిలో పొందిన వడ్డీ అవుతుంది. ■

## ఫలించిన పసుపు విత్తనోత్పత్తి

**ప**సుపు సాగు చేసే రైతులు పంట చేతికొచ్చే దశలో మేలైన విత్తనాన్ని చేసుకుంటారు. దానినే మరో సీజన్లో విత్తుతారు. ఏటా ఇదే పునరావృతం కావడంతో విత్తనం కోల్పోయింది. ఈ దశలో రైతులకు స్వచ్ఛమైన విత్తనాన్ని అందించాలని కమ్మర్పల్లి పసుపు పరిశోధన స్థానం నెలరోజుల క్రితం సంకల్పించింది. కొబ్బరిపీచు, సేంద్రియ ఎరువుతో ట్రేలలో శుద్ధి చేసిన పసుప ప్రయోగాత్మకంగా విత్తనోత్పత్తి చేపట్టారు. ఈ మొక్కలను రైతులకు ఉచితంగా అందించాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యాన సమీకృత అభివృద్ధి పథకంలో భాగంగా మొక్కల విత్తనోత్పత్తి, ప్రారంభించారు. ఇందులో తమిళనాడు సేలం రకం 1.50 లక్షలు, రాజేంద్రసోనియా 10 వేలు, పీతాంబరం 10 వేలు, రాజ ఐఐఎస్ఆర్ ప్రగతి 10 వేల మొక్కలు పెంచారు. ప్రస్తుతం ఆసక్తి ఉన్న రైతులకు ఉచితంగా పంపిణీ చేయడానికి శాస్త్రవేత్తలు మహేందర్, శ్రీనివాస్ ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎలం రకానికి డిమాండ్**

తమిళనాడు సేలం రకం పంటలో విదేశాలకు ఎగుమతి చేసే నాణ్యత ఉందని, ఈ రకాన్ని ఎక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని వ్యాపారులు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో సేలం రకాన్ని మొక్కల రూపంలో రైతులకు అందిస్తామని పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రకటించారు. ■

పర్వతాలను , మహా సముద్రాలను జయించడం కాదు ; ముందు నిన్ను నీవు జయించు

# సానుభూతి కాదు... సంరక్షణ కావాలి

"అది 2002. మా అమ్మాయికి తరచూ జ్వరం వస్తూండడంతో వైద్య పరీక్షలు చేయించాం. ఆస్తమా క్లిష్టమైన దశలో ఉందని తేలింది. దాంతో ఆమెను లఖనవూలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ (కెజిఎంయు) ఆసుపత్రిలో చేర్పించాం. వైద్యులు చికిత్స చేస్తూ ఉంటే... నేను, నా భర్త ఆ గది బయట కూర్చున్నాం. అక్కడ ఒక మహిళ రోదిస్తూ కనిపించారు. వివరాలు అడిగాం. తన కొడుకు అనారోగ్యంతో ఉన్నాడనీ, సర్జరీకి పదహారు వేలు అవసరమనీ, అయితే అంత డబ్బు సమకూర్చుకొనే స్తోమత తనకు లేదనీ ఆమె చెప్పారు. తన కొడుకు ప్రాణాలు దక్కించుకోవడం ఎలాగో అర్థం కావడం లేదని కన్నీళ్ళు పెట్టుకున్నారు. మేము ఆమెను ఓదార్చాం. "ఆమెకు మనం సాయం చెయ్యగలమా?" అని నా భర్తను అడిగాను. వెంటనే ఆయన ఇరవై వేలు తీసుకొచ్చి ఆ తల్లికి ఇచ్చారు. ఆపరేషన్ విజయవంతం అయింది. ఒక ప్రాణాన్ని కాపాడగలిగామని ఎంతో సంతోషించాం.



ఈ సంఘటన నా మీద ఎంతో ప్రభావం చూపించింది. అనారోగ్యాలు ముందుగా చెప్పి రావు. ఒక పూట భోజనానికే ఎంతో కష్టపడే పేద కుటుంబాలు... తమ వారికి అలాంటి పరిస్థితి వస్తే... వైద్య ఖర్చులు భరించలేవు.

వారికోసం ఏదైనా చెయ్యాలనుకున్నా. ఆ ఆసుపత్రిలో పిల్లలకు మందులు, ఆహారం, దుస్తులు ఇవ్వడం ఆరంభించాను. వ్యాపారస్తుడైన నా భర్త దగ్గర నుంచి డబ్బు తీసుకొనేదాన్ని. చాలామంది పిల్లలు కేన్సర్‌తో బాధపడుతున్నారనీ, వారికి దీర్ఘకాలిక సాయం అవసరమనీ గుర్తించాను. వందలమందికి సాయం చెయ్యడానికి నా భర్త సంపాదన సరిపోదు. దాతల సాయం తీసుకోవాలనే ఆలోచనతో.. 2005లో ఉత్తరప్రదేశ్‌లోని లఖనవూలో 'ఈశ్వర్ ఛైల్డ్ వెల్ఫేర్ ఫౌండేషన్' నెలకొల్పాను. ఆ రోజుల్లో మైక్రోబయాలజీలో పీజీ చేసి, రీసెర్చ్ చేస్తున్నాను. లక్ష్యం కోసం దాన్ని పక్కన పెట్టాను.

**మొదట్లో కష్టమయ్యేది...**

అప్పటినుంచీ ప్రధానంగా దాతలు ఇచ్చే మొత్తాలతోనే మా ఎన్జీవో సేవలు అందిస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం తీసుకోవడం లేదు. ఆరంభంలో చాలా ఇబ్బందులు పడ్డాను. ఏడాదికి సుమారు పదిలక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. అది చాలా పెద్ద మొత్తం. దాన్ని సమకూర్చుకోవడం ఎంతో కష్టమయ్యేది.. అయితే నిజాయితీగా చేసే పనికి ఫలితం ఉంటుందని నేను నమ్మాను. ఇప్పటికీ ఆ నమ్మకమే మా ఎన్జీవోను నడిపిస్తోంది. మా ద్వారా సాయం పొందుతున్న పిల్లలను రోజూ పలకరించడం, భోజనాలు అందించడం, వారికి ఎక్కువగా అవసరమైన వస్తువులు సమకూర్చడం లాంటివి చేసేదాన్ని. క్రమంగా నేను చేసే కార్యక్రమాల మీద ప్రజలకు నమ్మకం కలిగింది. వైద్యులు కూడా ఎంతోమంది దాతలకు మా పేరు సూచించడం మొదలుపెట్టారు.

**విద్య, పునరావాసం, ఉపాధి కూడా...**

ప్రస్తుతం రోగులకు, వారి తల్లితండ్రులకు నెలవారీ సరుకులను, మందులనూ సమకూరుస్తున్నాం. ప్రతివారం

కెజిఎంయు, 'డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్'లోని సుమారు 3,500 మంది రోగులకు సరిపోయే సరుకులనూ, అలాగే చికిత్స పొందుతున్న పిల్లలకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తున్నాం. దుప్పట్లు, దుస్తులు, రోజువారీగా కావలసిన వస్తువులు ఇస్తున్నాం. కేన్సర్ నిర్ధారణ జరిగి, అడ్మిట్ అయిన పిల్లల వివరాలను ఆసుపత్రుల నుంచి తీసుకుంటాం. వారి ఆర్థిక స్థితిగతులు తెలుసుకొని సాయం అందజేస్తాం. ఇప్పటివరకూ ఇరవై వేలమందికి పైగా పిల్లలు మా ఎన్జీవో ద్వారా ప్రయోజనం పొందారు. వారిలో చాలామంది కోలుకొని, కొత్త జీవితాన్ని మొదలుపెట్టారు.

అంతేకాదు... బాధితులకూ, వారి తోబుట్టువులకు విద్య, పునరావాసం, ఉపాధి అవకాశాల్లాంటివి కూడా మేము అందిస్తున్నాం. మొత్తం కుటుంబానికి సాయం అందితేనే సామాజికంగా, ఆర్థికపరంగా వారి పరిస్థితి మెరుగుపడుతుందనేది నా నమ్మకం. కేన్సర్ బాధితుల తల్లుల కోసం హస్తకళలు, ఆభరణాల తయారీ యూనిట్‌ను 2015లో ఆరంభించాం.

అలాగే కొవిడ్ సమయంలో ఉద్యోగాలు పోగొట్టుకున్న తండ్రుల కోసం మసాలా పొడుల తయారీ యూనిట్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా ముప్పైకి పైగా కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. వచ్చే ఆదాయంలో పది శాతాన్ని ఎన్జీవో నిధిలో జమ చేస్తున్నాం. వైద్యులు, సామాజిక సంస్థలు, వ్యక్తులు... ఇలా మా ఎన్జీవోకు ఇప్పుడు సుమారు పన్నెండువేల మంది దాతలు ఉన్నారు. నేను లేకపోయినా ఇది కొనసాగుతూనే ఉంటుంది.

తీవ్ర అనారోగ్యంతో ఉన్న పేద వర్గాల వారికి కావలసింది సానుభూతి కాదు... సంరక్షణ, దీర్ఘకాలికమైన సహకారం. సానుభూతి చూపించి, ఏదో కాస్త సాయం చేస్తే అది అక్కడితో అయిపోతుంది. అలా కాకుండా వారికీ, వారి కుటుంబానికీ మంచి భవిష్యత్తు కల్పించే దిశగా కృషి చెయ్యాలనేదే నా ఆశయం."

■

## తెలంగాణాలో ఉద్యోగులు, పెన్షనర్లకు కొత్త ఆరోగ్య పథకం!

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత, మరింత నాణ్యమైన వైద్యచికిత్సలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్ఎస్) తీసుకొచ్చింది. దీని అమలు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధ్యక్షతన ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు (జీవో నం 186) జారీచేశారు. "ఈ పథకం అమలుకు ఉద్యోగులు, పింఛనుదారులు తమ వాటాగా ట్రస్ట్‌కు ప్రతి నెల నిర్దేశితం మొత్తాన్ని జమ చేస్తారు. ఈ మొత్తం వారి వేతనం, పింఛను నుంచి బదిలీ అవుతుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా ప్రతి నెల జమ చేస్తుంది'' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, పింఛనుదారుల కోసం ప్రత్యేక ఆరోగ్య పథకం అమలు చేయాలని మొదటి పీఆర్సీ నివేదిక ఇచ్చిన సూచన మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఆ నివేదిక ప్రతిపాదించిన మేరకు ఆరోగ్య పథకానికి తమ మూల వేతనంలో ఒక శాతం విరాళం (కాంట్రిబ్యూషన్) ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి గతంలోనే తెలిపారు.

**ట్రస్ట్ ఏర్పాటు ఇలా..**

కొత్త ఈహెచ్ఎస్ అమలుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఛైర్ పర్సన్‌గా 'ఈహెచ్‌సీటీ" ఏర్పాటవుతుంది. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైద్య, ఆరోగ్య, విద్య, సాధారణ పరిపాలన శాఖల కార్యదర్శులు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, వైద్యవిద్య విభాగం సంచాలకుడు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోలు ఈహెచ్‌సీటీ సభ్యులుగా ఉంటారు. ఒక ప్రభుత్వ అధికారిని పథకం సీఈవోగా నియమిస్తారు. ఆయన ట్రస్టుకు మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. ఉద్యోగుల తరపున ఆరుగురిని, పెన్షనర్ల తరపున ఇద్దరిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.

■

మనసుండీ మార్గమంటే వెనుకాడేవారికి దారిచూపి నడిపించేవారే నాయకులు

# చీర కట్టడంలో ఇన్ని రకాలా! ఇంత నైపుణ్యమా!

**మీ**కు ఎన్ని రకాల చీర కట్టులు తెలుసు? మహా అయితే నాలుగైదు రకాలు. అంతేగా..! కానీ ముంబయికి చెందిన 74 ఏళ్ల కల్పనా షా... మూడు వందల రకాలుగా చీరలు కట్టగలరు. సెలబ్రిటీలకూ నచ్చేలా! నలభై ఏళ్లుగా విభిన్నంగా చీరలు చుడుతూ... దాన్నే వృత్తిగా మలుచుకున్న కల్పన ఆంధ్రజ్యోతి 'నవ్య'తో పంచుకున్న విశేషాలు ఆంధ్రజ్యోతి సౌజన్యంతో మహిళా సాధికారత పాఠకుల కోసం ...



'నేను సూరత్‌లో పుట్టాను. మేము గుజరాతీలం. అయితే నాన్న బిజినెస్ రీత్యా చిన్నతనం లోనే ముంబయికి మకాం మార్చేశాం. 1972లో నా పెళ్లయింది. నాకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. వీళ్లిద్దరూ నా వృత్తిలో ఎంతో సహాయపడుతూ ఉంటారు. 24 గంటల్లో 226 రకాల డ్రేపింగ్ స్టైల్స్‌ను పూర్తి చేసి రికార్డు నెలకొల్పిన సందర్భాన్ని నేను జీవితంలో మర్చిపోలేను. 1997లో బిబిసిలో నేను శారీ డ్రేపింగ్ స్టైల్స్‌ను ప్రదర్శించి చూపించాను. అది కూడా మర్చిపోలేని అనుభవమే!

చిన్నప్పటి నుంచీ నాకు అందంగా, ఆకర్షణీయంగా తయారవడమంటే ఇష్టం. దాంతో నాకు నేను తయారవడంతో పాటు ఎదుటి వాళ్లకు మేకప్ వేయడం, హెయిర్ స్టైల్ సెట్ చేయడం, వస్త్రధారణలో సహాయపడడం లాంటివి చేస్తూ ఉండేదాన్ని. అయితే పెళ్లి వరకూ నా అభిరుచిని నా వరకే పరిమితం చేసుకున్నాను. పెళ్లయిన నాలుగేళ్ల తర్వాత, నాకెంతో ఇష్టమైన వ్యాపకాన్నే వృత్తిగా మలుచుకుందామనే ఆలోచనతో 1978లో ప్రొఫెషనల్‌గా ఒక బ్యూటీ సెలూన్‌ను మొదలుపెట్టాను. సెలూన్ సేవల్లో భాగంగా, హెయిర్, మేకప్, శారీ డ్రేపింగ్ చేసేదాన్ని. నేను చీర కట్టించే విధానం ఎక్కువగా ఆదరణ పొందింది. ఐదేళ్ల తర్వాత కేవలం చీరకట్టు కోసమే నన్ను వేడుకలకు పిలవడం మొదలుపెట్టారు. కానీ మొదట్లో నేనీ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ నా కస్టమర్లకు నేను చీర కట్టే విధానమే ఎక్కువగా నచ్చింది. అలా కస్టమర్ల ద్వారానే చీరకట్టు పరంగా నేను ఎక్కువగా ప్రజాదరణ పొందాను.

**24 గంటల్లో 226 చీరకట్లు**

అంతవరకూ బాగానే ఉంది. సౌకర్యవంతంగా, అందంగా ఉండేలా చీర కట్టడంలో నేర్పరినే! అందులో సందేహం లేదు. అయితే కొందరు కస్టమర్లు కాస్త భిన్నంగా ఉండేలా చీర కట్టమని అడగడం మొదలు పెట్టడంతో తిరిగి ఆలోచనలో పడ్డాను.

ఇంట్లో స్వయంగా రకరకాల శారీ డ్రేపింగ్ స్టైల్స్‌ను సాధన చేయడం మొదలు పెట్టాను. మనుగడలో ఉన్న స్టైల్స్‌తో పాటు నావైన సొంత స్టైల్స్‌ను కూడా సృష్టించడం మొదలు పెట్టాను. నిరంతరంగా చీరకట్టుకు కొత్త అందాన్ని సమకూర్చి పెట్టే చిట్కాలు, పద్ధతుల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను.

అలా నాలుగేళ్ల వ్యవధిలో అన్ని రాష్ట్రాలు, ప్రాంతాల చీరకట్టుల మీద పట్టు పెంచుకోగలిగాను. అలా 1985

నుంచి పూర్తి స్థాయి శారీ డ్రేపర్‌గా స్థిరపడిపోయాను. 2022 ఏప్రిల్‌లో 24 గంటల్లో 226 రకాల చీరకట్టులను కట్టి చూపించి, 'మారథాన్ శారీ డ్రేపింగ్' రికార్డును నెలకొల్ప గలిగాను. ఆ 24 గంటల వ్యవధిలో క్రేప్, షిఫాన్, జార్జెట్, బెనారస్‌లతో పాటు కోట, సౌత్ సిల్క్. ఇలా భిన్నమైన మెటీరియల్ చీరలతో చీరలను కట్టి చూపించాను. గుజరాత్ నుంచి బెంగాల్ వరకూ, మహారాష్ట్ర నుంచి అసోమ్ వరకూ, కుర్గ్ నుంచి దక్షిణ భారతదేశం వరకూ అన్ని ప్రాంతాల చీరలనూ కట్టి చూపించాను. చీర కట్టడంతోపాటు చీరకట్టులో శిక్షణను కూడా ఇస్తూ ఉంటాను. చీరకట్టులో నా దగ్గర శిక్షణ పొందిన అమ్మాయిలు ప్రొషెషనల్స్‌గా విజయం సాధిస్తున్నారు.



**చీరను బట్టి కట్టు**

నేను నాలుగు నుంచి 9 గజాల చీరల వరకూ అన్ని చీరలనూ కట్టి చూపించగలుగుతాను. అలాగే చీరకట్టు కోసం నన్ను పిలిచినప్పుడు, ఆ చీర మెటీరియల్, బరువులను బట్టి, హాజరు కాబోయే వేడుకను బట్టి ఏ చీరకట్టు సూటవుతుందో అంచనా వేస్తాను. రెండు, మూడు రకాల డ్రేపింగ్ స్టైల్స్‌ను ఎంచుకుని, కస్టమర్లకు చూపిస్తాను. వాటిలో వాళ్లు ఎంచుకున్న స్టైల్‌లో చీర కట్టిస్తాను. కొన్ని చీరలు జారుడుగా ఉంటాయి. పల్చగా ఉంటాయి. కొన్ని చీరలు పది కిలోల బరువు కూడా ఉంటాయి. అయితే అది ఎలాంటి చీరైనా సౌకర్యంగా ఉండేలా, జారిపోకుండా ఒంటికి హత్తుకునేలా ఉండేలా కట్టి చూపిస్తాను.

చీరకట్టులో 'పిన్నింగ్' కీలక పాత్ర పోషిస్తుంది. ఎక్కడ పిన్నులు పెట్టాలి, ఎలాంటి పిన్నులు వాడాలి లాంటి వివరాలు చాలా ముఖ్యమైనవి. పెళ్లిళ్లు, ఫంక్షన్లు, ఈవెంట్లు లాంటి వేడుకల్లో గబగడా నడవవలసి వస్తుంది, పనులు చేయవలసి వస్తుంది. అలాంటి సందర్భాల్లో ఎలాంటి చికాకుకు గురి చేయకుండా, సౌకర్యంగా ఉండేలా చీరను కడతాను. ఏ చీరకట్టైనా కనిష్టంగా ఐదు నిమిషాల్లో పూర్తవుతుంది. కానీ 8, 9, 10 కిలోల బరువుండే చీరలను ఒంటికి హత్తుకునేలా కట్టడం కోసం 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతూ ఉంటుంది.

**బాలీవుడ్ నుంచి పిలుపు...**

హమ్ దిల్ దే చుకే సనమ్ సినిమాతో నేను బాలీవుడ్‌లోకి ప్రవేశించాను. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ నీతా లల్లా నన్ను బాలీవుడ్‌కు పరిచయం చేసింది. ఆ సినిమాలో ఐశ్వర్యా రాయ్‌కు చీరలు కట్టింది నేనే! ఐశ్యర్యతో పాటు బాలీవుడ్‌లోని ప్రధాన తారలందరికీ సినిమాల్లో శారీ డ్రైపింగ్ నేనే చేస్తూ ఉంటాను. ఐశ్వర్యారాయ్, కత్రినాఖైఫ్, దీపికా పడుకొనె, క్రితిసనన్‌లకు, ఇప్పటివరకూ నేనే శారీ డ్రేపింగ్ స్టైలిస్ట్‌ను. వీళ్లకు సినిమాలతో పాటు స్పెషల్ షోల కోసం, సినీఫంక్షన్ల కోసం చీరలను నేనే కడుతూ ఉంటాను.

**వర్క్‌షాప్స్ కూడా...**

దేశవ్యాప్తంగా వర్క్ షాప్స్ కూడా నిర్వహిస్తూ ఉంటాను. అన్ని వయసుల వారికీ శారీ డ్రేపింగ్ పాఠాలు నేర్పిస్తూ ఉంటాను. భారతీయ సంప్రదాయంలో భాగమైన చీరకట్టును ప్రమోట్ చేయడం కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి కాఫీ టేబుల్ బుక్ అండ్ రిఫరెన్స్ గైడ్ అయిన 'ది హోల్ 9 యార్డ్స్' అనే పుస్తకాన్ని కూడా రాశాను. దీన్లో భారతీయ చీరలను భిన్నంగా ఎలా కట్టుకోవచ్చో వివరించాను. ప్రస్తుత ఆధునిక తరం కోసం 'లెర్న్ శారీ' అనే మొబైల్ యాప్‌ను కూడా రూపొందించాను. ఇది గూగుల్, యాపిల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. సెల్ఫ్ మేడ్ శారీ డ్రేపింగ్ కళాకారిణిగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా చోటు దక్కించుకోగలిగాను

■

లక్ష్యసాధనలో భయసందేహాలను మించిన శత్రువులు వేరేవుండరు

# అవార్డులు గెలుచుకున్న సమాఖ్యల వివరాలు

| వ.నెం. | ర్యాంకు | స్వయంసహాయక సంఘ (సమాఖ్య) ఫెడరేషన్ పేరు | ప్రమోటర్ | బ్లాకు | జిల్లా | రాష్ట్రం |
|---|---|---|---|---|---|---|
| 1. | మొదటి ర్యాంకు | కిన్ననూర్ కరింతలం కుడుంబశ్రీ సిడిఎస్ | కుడుంబశ్రీ | పరప్పా | కాసర్‌గడ్ | కేరళ |
| 2. | రెండవ ర్యాంకు | శ్రీ పద్మావతి మహిళా అభ్యుదయ సంఘం | రాస్&ప్రధాన్ ఫౌండేషన్ | తిరుపతి | తిరుపతి | ఆంధ్రప్రదేశ్ |
| దక్షిణ ప్రాంత విజేతలు | | | | | | |
| 3. | మొదటి ర్యాంకు | పాకాల మండల మహిళా సమాఖ్య మ్యూచువల్లీ ఎయిడెడ్ (థ్రిఫ్ట్ అండ్‌క్రెడిట్ సొసైటీ | సెర్ప్.ఏపీ | పాకాల | తిరుపతి | ఆంధ్రప్రదేశ్ |
| 4. | రెండవ ర్యాంకు | కొడవలూర్ సంఘమిత్ర | సెర్ప్. ఏపీ | కొడవలూరు | ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు | ఆంధ్రప్రదేశ్ |
| పశ్చిమ ప్రాంత విజేతలు | | | | | | |
| 5. | మొదటి ర్యాంకు | కయపలాట్ లోక్‌సంచాలిత్ సాధన్ కేంద్రవాషిమ్ | మావిమ్ | షాపూర్ | థానే | మహారాష్ట్ర |
| 6. | రెండవ ర్యాంకు | లోక్ సంచాలిత్ సాధన్ కేంద్ర వాషిమ్ | మావిమ్ | వాషిమ్ | వాషిమ్ | మహారాష్ట్ర |
| ఉత్తర ప్రాంత విజేతలు | | | | | | |
| 7. | మొదటి ర్యాంకు | ఉమాంగ్ రాజీవిక మహిళా సర్వాజిన్ వికాస్ సహకారి సమితి | రాజీవిక | రాంఘర్ | ఆల్వాన్ | రాజస్థాన్ |
| స్పెషల్ క్యాటగిరీ అవార్డు - ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్ ఓన్డ్ & మేనేజ్డ్ ఎంటర్‌ప్రైజ్ | | | | | | |
| 8. | గుమ్మర్ మహిళా ప్రొడ్యూసర్ కంపెనీ లి. | | స్వయన్ | బాలి | పాలి | రాజస్థాన్ |
| ప్రశంసా పత్రం (లెటర్ ఆఫ్ అప్రీసియేషన్) | | | | | | |
| 1. | గంట్యాడ మండల్ ఇందిరా క్రాంతి పథం పరస్పర సహాయక సహకార సమాఖ్య లిమిటెడ్ | | సెర్ప్. ఏపీ | గంట్యాడ | విజయనగరం | ఏపీ |
| 2. | భరతమాత మండల్ మ్యూచువల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ మరియు క్రెడిట్ కో-ఆపరేటివ్ | | సెర్ప్-టిఎస్ | భీమదేవరపల్లి | హన్మకొండ | తెలంగాణ |
| 3. | జనసేవ జీవిక మహిళా స్వావలంబసహకారి శాంకుల్ సంఘ్ లిమిటెడ్ | | జీవిక | సోంబర్సా | సహ్రస | బీహార్ |
| 4. | మిథిలా సేవిక మహిళా స్వావలంబ్ సహకారి సంకుల్ సంఘ్ లిమిటెడ్ | | జీవిక | సౌర్ బజార్ | సహ్రస | బీహార్ |

**కలసి రావడం ఆరంభం, కలసి నిలవడం పురోగమనం, కలసి నడవడం విజయం**

## సమాఖ్యలకు పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖులకు సన్మానాలు!








































MAHILA SADHIKARATHA
Publication Date: 01-11-2023 ; Posting Date: 05 & 06-11-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యల ప్రతినిధులు పురస్కారాలు అందుకున్న దృశ్యాలు !

























To ADDRESS




శ్రీ ఎస్ రామన్ పుస్తకావిష్కరణ

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089